మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

గురువారం THURSDAY 23-7-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 24 Issue: 24

23 జూలై 2026 - గురువారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:56 సూర్యాస్తమయం - సా. 6:48 తిథి నవమి ఉ. 7:03 వరకు తరువాత దశమి సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం విశాఖ రా. 1:360 వరకు తరువాత అనురాధ యోగం శుభ రా. 7:12 వరకు కరణం కౌలవ ఉ. 7:03 వరకు తైతుల రా. 8:07 వరకు వర్జ్యం తె. 5:16 నుండి ఉ. 7:03 వరకు దుర్ముహూర్తం ఉ. 10:14 నుండి ఉ. 11:05 వరకు మ. 3:22 నుండి సా. 4:14 వరకు రాహుకాలం మ. 1:59 నుండి మ. 3:35 వరకు యమగండం తె. 5:56 నుండి ఉ. 7:32 వరకు గుళికాకాలం ఉ. 9:09 నుండి ఉ. 10:46 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:20 నుండి తె. 5:08 వరకు అమృత ఘడియలు మ. 3:55 నుండి సా. 5:41 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:56 నుండి మ. 12:48 వరకు గమనిక: "౦" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial

# చర్చలకు మేం సిద్ధం

### విద్యార్థుల నిరసనలతో ప్రతిపక్షాల రాజకీయాలు

### మైలేజీ కోసమే నీట్ లీక్ అంశంపై రాద్ధాంతం

### కాంగ్రెస్ రాష్ట్రాల్లో లీకేజీలపై రాహుల్ మాట్లాడరేం?

## కేంద్ర మంత్రి జేపీ నడ్డా విసుర్లు



**నీట్ పేపర్ లీక్ అంశంపై పార్లమెంటు వేదికగా లోతైన చర్చకు తాము సిద్ధమేనని కేంద్ర మంత్రి జేపీ నడ్డా తెలిపారు. పేపర్ లీక్ అంశం, విద్యార్థుల నిరసనలతో రాజకీయాలు వద్దని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ముందుకు రావాలని అన్నారు. విద్యార్థుల డిమాండ్స్, సమస్యలతో రాజకీయం చేసి లాభం పొందేందుకు ప్రయత్నించడం తగదని మంత్రి జేపీ నడ్డా అన్నారు.**

న్యూఢిల్లీ:కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో పేపర్ లీక్ ఉదంతాలపై రాహుల్ గాంధీ ఎందుకు స్పందించట్లేదని మంత్రి నడ్డా ప్రశ్నించారు. జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్, తెలంగాణ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, పంజాబ్, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో పేపర్ లీక్ ఉదంతాలు వెలుగు చూశాయని అన్నారు. కేవలం ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లోని అంశాలనే ఎందుకు ఎంచుకుంటున్నారని అన్నారు. 150 పేపర్ లీక్ ఉదంతాలు వెలుగు చూశాయన్న రాహుల్ గాంధీ ఆరోపణపై కూడా మంత్రి స్పందించారు. ప్రతి కేసుపై దర్యాప్తు చేసేందుకు తాము సిద్ధంగానే ఉన్నామని అన్నారు. 'ఈ ఆరోపణలపై దర్యాప్తు జరగాలి. మాది బాధ్యతగల ప్రభుత్వం. కాబట్టి, అన్ని కేసులపై దర్యాప్తు చేసి నిజానిజాలను ప్రజల ముందు ఉంచుతాము' అని నడ్డా అన్నారు. నీట్ ప్రశ్నాపత్రం లీక్ అంశాన్ని రాజకీయ తరువాయి 2 వ పేజీలో...



# అంతా టైం వేస్ట్ యవ్వారం

### మా సమయం వృథా చేయొద్దు

### అందోళనల వీడియోలు చూసే టైం లేదు

### సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్

న్యూఢిల్లీ: పార్లమెంట్ మార్చ్ సందర్భంగా విద్యార్థి నిరసనకారులపై పోలీసుల చర్యలకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను అత్యవసరంగా విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. "మాకు వీడియోలు చూసే ఆసక్తి లేదు, అంత సమయం కూడా లేదు" అని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్య కాంత్ వ్యాఖ్యానిస్తూ, కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలపై జోక్యం చేసుకోవాలన్న అభ్యర్థనను తోసిపుచ్చారు. బుధవారం నాటి విచారణలో ఓ లాయర్ ఈ అంశాన్ని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం ఎదుట ప్రస్తావిస్తూ, తరువాయి 2 వ పేజీలో...



# విడువం మేం పంతం

### జంతర్‌మంతర్‌లో మళ్లీ ఉద్రిక్తత.. పోలీసులపై రాళ్ల దాడి.. పలువురికి గాయాలు

### భారీగా మోహరించిన భద్రతా బలగాలు.. చర్చలు కొనసాగుతున్నా వీడని ప్రతిష్ఠంభన

**నీట్-యూజీ 2026 ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరసనలు బుధవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద మరోసారి ఉద్రిక్తతలకు దారితీశాయి. పార్లమెంట్ ముట్టడి సందర్భంగా జరిగిన ఘర్షణల అనంతరం పోలీసులు తొలగించిన టెంట్లు, వేదిక స్థానంలోనే నిరసనకారులు తిరిగి చేరుకుని ఆందోళనలు కొనసాగించారు.**

న్యూఢిల్లీ: పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో భారీ సంఖ్యలో ఢిల్లీ పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలను మోహరించారు. ఆందోళనకారులు -2 వ పేజీలో...

# గాంధీ వర్సెస్ గాడ్సే

### ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయాలి.. ప్రధాని మోదీకి సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్

**నీట్ పేపర్ లీకేజీ వివాదంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తక్షణమే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.**

కొడంగల్, జూలై 22 (ఈవార్తలు): యువత హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని నిరంతరం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను బాధ్యతల నుంచి తొలగించలేకపోతే, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ తన పదవికి రాజీనామా చేయాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. మోదీని గద్దె దించి రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేసేందుకు తన నియోజకవర్గం నుంచే ప్రతిన తరువాయి 2 వ పేజీలో...



# రాహుల్, రేవంత్ ధర్నాలు డ్రామాలు

## కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపణ

హైదరాబాద్, జూలై 22 (ఈవార్తలు): నీట్ వివాదం, ఆరు గ్యారంటీల అమలులో విఫలమైన తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఆందోళన డ్రామాలకు తెరదీసిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్రంగా ఆరోపించారు. రాహుల్ గాంధీ ప్రతిపక్ష నేతగా ఉన్నంత కాలం అది బీజేపీకే లాభమని, ఆయన తమ పార్టీకి బ్రాండ్ అంబాసిడర్ అని ఎద్దేవా చేశారు. ప్రధాని నివాసం వద్ద శాంతిభద్రతలకు విఘాతం కలిగించినందుకే పోలీసులు నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారని, నీట్ అంశంపై కేంద్రం పార్లమెంట్‌లో చర్చకు సిద్ధంగా ఉందని తెలిపారు. అలాగే, రాహుల్ కాబోయే ప్రధాని అని రేవంత్ రెడ్డి అనడం పెద్ద జోక్ తరువాయి 2 వ పేజీలో...






బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,651 |
| వెండి (కిలో): | రూ.2,45,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,137 |

## విశ్వవాణి



**నీతి ఆయోగ్ సీఈవోగా అనురాగ్ జైన్**

న్యూఢిల్లీ: సీనియర్ ఐఏఎస్ అధికారి అనురాగ్ జైన్‌ను నీతి ఆయోగ్ కొత్త ముఖ్య కార్యనిర్వాహక అధికారి (సీఈవో)గా కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు కేంద్ర మంత్రివర్గ నియామకాల కమిటీ (ఏసీసీ) ఆమోదం తెలిపింది. ఆయన రెండేళ్లపాటు లేదా తదుపరి ఆదేశాలు వెలువడే వరకు ఈ బాధ్యతలు నిర్వహించనున్నారు. 1989 బ్యాచ్‌కు చెందిన మధ్యప్రదేశ్ క్యాడర్ ఐఏఎస్ అధికారి అయిన అనురాగ్ జైన్‌కు దాదాపు నాలుగు దశాబ్దాల పరిపాలనా అనుభవం ఉంది. కేంద్ర, మధ్యప్రదేశ్ ప్రభుత్వాల్లో పలు కీలక పదవులు నిర్వహించిన ఆయన మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారిశ్రామిక విధానాలు, పెట్టుబడుల ప్రోత్సాహం, పరిపాలనా సంస్కరణల అమలులో విశేష అనుభవాన్ని సంపాదించారు.

# వానదేవుడు దయ చూపెడ్తున్నడు!

### రెండ్రోజులు భారీ వానలు.. 9 జిల్లాల్లో భారీ వర్షాలు.. వాతావరణ శాఖ హెచ్చరికలు

**తెలంగాణ రాష్ట్రంలో మరో రెండు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశముందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హైదరాబాద్ కేంద్రం హెచ్చరించింది. నైరుతి రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రంలోని 9 జిల్లాలకు భారీ వర్షాల హెచ్చరిక జారీ చేయగా.. మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.**

హైదరాబాద్, జూలై 22 (ఈవార్తలు): గంటకు 30 కిలోమీటర్ల నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు కూడా వీచే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. ఐఎండీ హెచ్చరికల ప్రకారం.. ఆదిలాబాద్, కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించారు. ఈ తరువాయి 2 వ పేజీలో...



# నేల తల్లికి దూపైతున్నది!

### మీటర్ మేర పడిపోయిన భూగర్భ జలాలు

### ఎల్ నినో ఎఫెక్ట్‌తో తగ్గిన వర్షపాతం

హైదరాబాద్, జూలై 22 (ఈవార్తలు): ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది తెలంగాణలో వర్షపాతం గణనీయంగా తగ్గడంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. వర్షపాతం, భూగర్భ జలాల లభ్యత, అందుబాటులో ఉన్న సాగునీటి వనరులను నిరంతరం విశ్లేషిస్తూ, పంటల సరళిలో మార్పుల కోసం ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తోంది. ఇందులో భాగంగానే రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు దిశగా ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టింది. ఈ సీజన్‌లో వరి సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గే అవకాశం ఉన్నందున, రైతులు ప్రత్యామ్నాయంగా పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాలు, కూరగాయల వంటి తక్కువ నీటితో పండే పంటలను ఎంచుకోవాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి తరువాయి 2 వ పేజీలో...

# అదనంగా 8 లక్షల టన్నులు కొంటం

### తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్



**కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు భారీ గుడ్‌న్యూస్ చెప్పింది. తెలంగాణలో రబీ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని గణనీయంగా పెంచుతూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు 35 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉన్న తెలంగాణ బియ్యం కొనుగోలు అంచనాను అదనంగా మరో 8 లక్షల మెట్రిక్ టన్నులు పెంచి మొత్తంగా 43 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.**

న్యూఢిల్లీ: ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని వేలాది మంది రైతులకు భారీ ఊరట లభించనుంది. అధిక దిగుబడులు వచ్చినా రైతులు తమ ధాన్యాన్ని విక్రయించడంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ఈ నిర్ణయం ఉపయోగపడనుంది. ఈ ఏడాది తెలంగాణలో వరి సాగు విస్తీర్ణం, దిగుబడులు పెరిగే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం నుంచి సేకరించే బియ్యం పరిమాణాన్ని పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని సీఎం రేవంత్ రెడ్డి సహా వ్యవసాయ శాఖ కోరింది. దీనిపై సానుకూలంగా స్పందించిన కేంద్ర ప్రభుత్వం.. సవరించిన అంచనాలకు తాజాగా ఆమోదం తెలిపింది. 43 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం అంటే సుమారు 64 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యానికి సమానం కావడం విశేషం. కొనుగోలు -2 వ పేజీలో...



# రేపు స్కూళ్లు, కాలేజీలు బంద్

హైదరాబాద్, జూలై 22 (ఈవార్తలు): రాష్ట్రంలో ఈ నెల 24న రాష్ట్రవ్యాప్తంగా స్కూళ్లు, కాలేజీలు, యూనివర్సిటీల బంద్‌కు పలు విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. నీట్ పరీక్షల్లో అవకతవకలు, పేపర్ లీకేజీ వ్యవహారంపై నిరసన వ్యక్తం చేస్తూ.. ఢిల్లీలో ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌ను ఖండిస్తూ ఈ బంద్ నిర్వహిస్తున్నట్లు ప్రకటించాయి. ఎస్ఎఫ్ఐ, తరువాయి 2 వ పేజీలో...

# అవినీతి ముత్యం

### భారీగా అపార్ట్‌మెంట్లు, ఫ్లాట్లు

### కిలోల కొద్దీ బంగారం, నోట్ల కట్టలు

### రెడ్కో డీఈ ముత్యం వెంకటరమణ అరెస్ట్

హైదరాబాద్, జూలై 22 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ట్రాన్స్‌కో డిప్యూటీ ఇంజనీర్ (డీఈ) ముత్యం వెంకటరమణ.. ఏసీబీ అధికారులకు చిక్కారు. భారీగా అక్రమాస్తులు గుర్తించడంతో.. ఆయనను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లోని నివాసంతో పాటు ఆయనకు సంబంధించిన మొత్తం తొమ్మిది ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. దాదాపు 12 గంటల పాటు సాగిన ఈ తనిఖీల్లో భారీ ఎత్తున అక్రమాస్తులు వెలుగులోకి రావడంతో వెంకటరమణను అధికారులు అరెస్ట్ చేశారు. ఏసీబీ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ముత్యం వెంకటరమణ ఆదాయానికి మించి రూ.27.65 కోట్ల విలువైన ఆస్తులు కూడబెట్టినట్లు ప్రాథమికంగా తరువాయి 2 వ పేజీలో...



## రాశి ఫలాలు



23.7.2026

**మేషం:** చేపట్టిన పనులు అతి కష్టం మీద పూర్తవుతాయి. స్థిరాస్తి వ్యవహారాలలో పెద్దలతో ఆలోచించి మాట్లాడాలి. వృత్తి వ్యాపారాలు మిశ్రమంగా సాగుతాయి. ఉద్యోగాలలో అధికారుల నుండి వ్యతిరేకత పెరుగుతుంది. ప్రయాణాలు వాయిదా పడతాయి. సంతాన ఉద్యోగ ప్రయత్నాలు నిరుత్సాహపరుస్తాయి.

**వృషభం:** ముఖ్యమైన వ్యవహారాలలో సోదరుల సహాయంతో ముందుకు సాగుతారు. అవసరానికి రావలసిన సొమ్ము అందుతుంది. స్థిరాస్తి వివాదాలు పరిష్కారమౌతాయి. గృహ వాతావరణం సంతోషకరంగా ఉంటుంది. వృత్తి, ఉద్యోగ పరంగా అనుకూల వాతావరణం ఉంటుంది. దైవ కార్యక్రమాలు నిర్వహిస్తారు.

**మిధునం:** నేత్ర సంభందిత అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. ఆర్థికంగా మరింత ఇబ్బందికర వాతావరణం ఉంటుంది. నిరుద్యోగులకు లభించిన అవకాశములు సద్వినియోగం చేసుకోవడంలో విఫలమౌతారు. వృత్తి వ్యాపారాలలో స్వల్ప లాభాలు అందుతాయి.

**కర్కాటకం:** సమాజంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. అనుకున్న పనులలో జాప్యం కలిగిన నిదానంగా పూర్తిచేస్తారు. ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. ధన సంబంధిత విషయాలు సంతృప్తికరంగా సాగుతాయి. వ్యాపారాలలో నూతన పెట్టుబడులు అందుతాయి. వృత్తి ఉద్యోగాలలో హోదాలు పెరుగుతాయి.

**సింహం:** చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. వ్యాపారాలలో నూతన సమస్యలు చికాకు పరుస్తాయి. ఆదాయానికి మించి ఖర్చు పెరుగుతుంది. ఋణదాతల నుండి ఒత్తిడి పెరుగుతుంది. ఉదర సంబంధ అనారోగ్య సమస్యలు భాదిస్తాయి. ఇతరులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది.

**కన్య:** ఆర్థిక పరంగా అనుకూల వాతావరణం ఉంటుంది. గృహమున శుభకార్య విషయంపై ప్రస్తావన వస్తుంది. సంఘంలో ప్రముఖుల నుండి విశేషమైన ఆదరణ లభిస్తుంది. సంతాన ఉద్యోగ వివాహ ప్రయత్నాలు అనుకూలస్తాయి. బంధు మిత్రుల సహాయంతో కొన్ని పనులు పూర్తి చేస్తారు. ఉద్యోగమున అదనపు బాధ్యతల నుండి ఉపశమనం పొందుతారు.

**తుల:** కష్టపడినా శ్రమకు తగిన ఫలితం ఉండదు. వృత్తి వ్యాపారాలలో స్వంత ఆలోచనలతో పనులు చెయ్యడం మంచిది. ఉద్యోగమున సమస్యలు పరిష్కార దిశగా సాగుతాయి. వ్యాపార వ్యవహారాలు ఆశాజనకంగా సాగుతాయి. ఇంటా బయట అనుకూల వాతావరణం ఉంటుంది. బంధువులలో చిన్నపాటి వివాదాలు ఉంటాయి.

**వృశ్చికం:** కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు కలుగుతాయి. చేపట్టిన పనులు మధ్యలో నిలిచిపోతాయి. ఇతరుల ప్రవర్తన వలన మానసిక అశాంతి కలుగుతుంది. వృత్తి వ్యాపారాలు మందగిస్తాయి. ఉద్యోగ ప్రయత్నాలు నిరుత్సాహపరుస్తాయి. కుటుంబ సభ్యుల ఆరోగ్య విషయంలో జాగ్రత్త వహించాలి.

**ధనస్సు:** దూర ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. సంతాన వ్యవహారాలు సమస్యాత్మకంగా సాగుతాయి. వృత్తి వ్యాపారాలలో గందరగోళ పరిస్థితులుంటాయి. విద్యార్థులు మరింత కష్టపడవలసి వస్తుంది. ఉద్యోగాలలో అదనపు బాధ్యతలు విసుగు కలిగిస్తాయి. విలువైన వస్తువుల విషయంలో జాగ్రత్త అవసరం.

**మకరం:** ముఖ్యమైన వ్యవహారాలలో జీవిత భాగస్వామి సలహా తీసుకొని ముందుకు సాగడం మంచిది. ప్రభుత్వ అధికారులతో జాగ్రత్తగా వ్యవహరించాలి. సంతాన విద్యా విషయాలు సానుకూల ఫలితాలు ఇస్తాయి. ప్రయాణాలలో నూతన పరిచయాలు కలుగుతాయి. ఉద్యోగమున ఉన్నత పదవులు పొందుతారు.

**కుంభం:** ధన పరమైన ఆలోచనలు అనుకూలిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుకుంటారు. బంధు మిత్రులతో సఖ్యత కలుగుతుంది. వ్యాపారాలలో శత్రు సమస్యల నుండి తెలివిగా బయటపడతారు. ఇంటా బయట అనుకూల వాతావరణం ఉంటుంది. కుటుంబ సభ్యులతో పుణ్యక్షేత్రాలు దర్శించుకుంటారు.

**మీనం:** మంచి ఆలోచనా జ్ఞానంతో ముందుకు సాగుతారు. నూతన వస్తు వాహనం కొనుగోలు చేస్తారు. దూరప్రాంతాల బందువుల నుండి శుభవార్తలు అందుతాయి. ఉద్యోగమున అధికారుల నుండి ప్రశంసలు పొందుతారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. సంతానం విద్యా ఉద్యోగ విషయంలో శుభవార్తలు అందుతాయి.

# చర్చలకు మేం సిద్ధం

మొదటి పేజీ తరువాయి

మైలేజ్ కోసం ఉపయోగించొద్దని ప్రతిపక్షాలకు సూచించారు. పేపర్ లీకేజీ ఘటనలను రాజకీయాలకు అతీతంగా చూడాల్సిన అవసరం ఉందన్నారు. 'ఎంతసేపైనా చర్చించేందుకు మేము సిద్ధం. సమస్యలకు పరిష్కారం పార్లమెంట్‌లో చర్చ ద్వారానే లభిస్తుంది. చర్చలకు పార్లమెంట్‌కు మించిన వేదిక మరొకటి లేదు' అని జేపీ నడ్డా వ్యాఖ్యానించారు.

### సోనమ్ వాంగ్‌చుక్‌కు పరామర్శ

ఢిల్లీలోని మేదాంత ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రముఖ పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను బుధవారం కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ పరామర్శించారు. జంతర్ మంతర్ వద్ద సుదీర్ఘంగా నిరాహార దీక్ష చేస్తూ తీవ్ర అస్వస్థతకు గురైన ఆయనను అధికారులు తొలుత సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మెదాంత ఆసుపత్రిలోని ఐసీయూకి తరలించారు. ఈ నేపథ్యంలో ఆసుపత్రికి వెళ్లిన మంత్రులు ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడిన జేపీ నడ్డా.. వాంగ్‌చుక్ వెంటనే తన నిరాహార దీక్షను విరమించి, యువతను సరైన మార్గంలో నడిపించాలని కోరినట్లు వెల్లడించారు. అలాగే, వాంగ్‌చుక్ రాసిన బహిరంగ లేఖపై కేంద్ర ప్రభుత్వం త్వరలోనే అధికారికంగా స్పందిస్తుందని స్పష్టం చేశారు. విద్యార్థులు లేవనెత్తిన ప్రతి అంశంపైనా చర్చించేందుకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని, లేఖకు బదులిచ్చిన తర్వాత తదుపరి చర్చలు ముందుకు సాగుతాయని నడ్డా వివరించారు. కాగా, నీట్ పేపర్ లీకేజీలకు వ్యతిరేకంగా పోరాడుతున్న విద్యార్థులు, యువతపై ఎలాంటి కక్షసాధింపు చర్యలు ఉండవని స్పష్టమైన హామీ ఇస్తేనే నిరాహార దీక్ష విరమిస్తానని వాంగ్‌చుక్ కేంద్రానికి తేల్చిచెప్పారు. ఈ మేరకు మంత్రులకు రాసిన లేఖలో ఆయన తన డిమాండ్లను స్పష్టంగా పేర్కొన్నారు. న్యాయబద్ధమైన విద్యావ్యవస్థ కోసం గొంతెత్తిన విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. నీట్ లీకేజీల కారణంగా మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు తగిన నష్టపరిహారం చెల్లించాలన్న డిమాండ్‌పై కేంద్ర మంత్రులు సానుకూలంగా స్పందించారు. పరీక్షల నిర్వహణలో జరిగిన అవకతవకలపై పార్లమెంటులో అర్థవంతమైన చర్చ జరిగేలా చూస్తామని వాంగ్‌చుక్‌కు నడ్డా, జితేంద్ర సింగ్ హామీ ఇచ్చారు. ప్రభుత్వ పెద్దల నుంచి సానుకూల స్పందన రావడం కాస్త ఊరటనిచ్చే అంశం. ప్రభుత్వం చాలా డిమాండ్లకు అంగీకరించినా, విద్యార్థులపై ఎలాంటి చట్టపరమైన, శిక్షాత్మక చర్యలు తీసుకోబోమని లిఖితపూర్వక హామీ ఇచ్చే విషయంలోనే ఇంకా పీటముడి వీడలేదని వాంగ్‌చుక్ వెల్లడించారు. నిరసనల్లో పాల్గొన్న ఏ ఒక్క యువకుడిపైనా కేసులు నమోదు చేయబోమని ప్రభుత్వం కచ్చితమైన ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. దీనిపై కేంద్రం అధికారిక ప్రకటన చేస్తే వాంగ్‌చుక్ దీక్ష ముగిసే అవకాశం ఉంది.

# విడువం మేం పంతం

మొదటి పేజీ తరువాయి

పార్లమెంట్ వైపు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సందర్భంగా కొందరు నిరసనకారులు పోలీసులపై రాళ్లు, సీసాలు విసిరినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనలో పలువురు పోలీసు సిబ్బంది గాయపడ్డారు. హింసాత్మక ఘటనలు మరింత విస్తరించకుండా పోలీసులు అదనపు బలగాలను రంగంలోకి దించారు. పరిస్థితుల దృష్ట్యా జంతర్‌మంతర్ పరిసరాల్లో ఇంటర్నెట్ సేవలపై తాత్కాలిక ఆంక్షలు విధించారు. భద్రతా కారణాల రీత్యా రాజీవ్ చౌక్, ఐటీవో, మండీ హౌస్ సహా 16 మెట్రో స్టేషన్లను తదుపరి ఆదేశాలు వచ్చే వరకు మూసివేశారు. కాగా, సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే మాట్లాడుతూ ప్రభుత్వంతో చర్చలకు సిద్ధమేనని, అయితే తమ ప్రతినిధుల వద్దకే ప్రభుత్వం రావాలని స్పష్టం చేశారు. చర్చలు తటస్థ ప్రదేశంలో లేదా జంతర్‌మంతర్‌లో జరగవచ్చని సీజేపీ ప్రతినిధి ఆశుతోష్ రంకా తెలిపారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు ఉద్యమాన్ని విరమించబోమని స్పష్టం చేశారు. ఆందోళనల్లో పాల్గొనే వారిని నాలుగు నినాదాలకు మాత్రమే పరిమితం కావాలని సీజేపీ నాయకత్వం సూచించింది. ప్రతికూల నినాదాలు ఉద్యమ లక్ష్యాన్ని దెబ్బతీసేలా ఉపయోగించుకునే అవకాశం ఉందని పేర్కొంది. మరోవైపు, నీట్ పేపర్ లీక్ అంశంపై పార్లమెంట్‌లో విస్తృత చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర వర్గాలు తెలిపాయి. విద్యార్థులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నాయి. ఇదే సమయంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలవడం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపింది. అటు.. జూలై 20 నుంచి కొనసాగుతున్న నిరసనలకు సంబంధించి ఇప్పటివరకు మొత్తం 10 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు ఢిల్లీ పోలీసులు వెల్లడించారు. పోలీసులపై దాడులు, రాళ్ల దాడి, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం, విధులకు ఆటంకం, అనుమతి లేకుండా డ్రోన్ వినియోగం తదితర ఆరోపణలపై కేసులు నమోదయ్యాయి. ఘటనలకు సంబంధించిన 250కిపైగా వీడియోలను పరిశీలిస్తూ నిందితులను గుర్తించే ప్రక్రియ కొనసాగుతోంది. కాగా, సీజేపీ ఉద్యమానికి తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే నేతలు మద్దతు ప్రకటించారు. విద్యార్థుల ఆందోళనలపై ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని తీవ్రంగా విమర్శించారు.

## వానదేవుడు దయ చూపెడ్తున్నడు!

మొదటి పేజీ తరువాయి

9 జిల్లాల్లో 64.5 మిల్లీమీటర్ల నుంచి 115.5 మిల్లీమీటర్ల వరకు భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. లోతట్టు ప్రాంతాల్లో నివసించేవారు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మరోవైపు.. హైదరాబాద్ నగరంలో బుధవారం సాయంత్రం నుంచి పలుచోట్ల భారీ వర్షం కురిసింది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, యూసుఫ్‌గూడ, సనత్‌నగర్, ఫిలింనగర్, బోరబండ, ఎర్రగడ్డ, అమీర్‌పేట్, పంజాగుట్ట, ఎస్ఆర్ నగర్, సికింద్రాబాద్, బోయిన్‌పల్లి, తిరుమలగిరి, అల్వాల్ వంటి ప్రాంతాల్లో వర్షంతో రహదారులు జలమయం అయ్యాయి. ఆకస్మిక వర్షంతో నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ నెమ్మదించగా.. వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. డ్రైనేజీలు పొంగిపొర్లే పరిస్థితులు తలెత్తడంతో జీహెచ్ఎంసీ, డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్) బృందాలు అప్రమత్తం అయ్యాయి. వర్షపు నీరు నిల్వ కాకుండా చర్యలు చేపడుతూ సమస్యాత్మక ప్రాంతాలను పర్యవేక్షిస్తున్నాయి. రానున్న రెండు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా మేఘావృత వాతావరణంతో పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకుండా, వాతావరణ హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనించాలని అధికారులు సూచిస్తున్నారు. ఇక హైదరాబాద్‌లో స్కూళ్లు, కాలేజీలు, ఆఫీసుల నుంచి విద్యార్థులు, ఉద్యోగులు ఇళ్లకు వెళ్లే సమయంలో కురిసిన భారీ వర్షాలకు తీవ్ర అవస్థలు పడ్డారు. కొన్ని ప్రాంతాల్లో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

## అదనంగా 8 లక్షల టన్నులు కొంటం

మొదటి పేజీ తరువాయి

లక్ష్యం పెరగడంతో రైతులు పండించిన ధాన్యానికి మరింత మార్కెట్ లభించే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు వెల్లడించారు. మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు జరిగే అవకాశం పెరగడంతో రైతుల ఆదాయానికి భరోసా లభిస్తుందని వ్యవసాయ వర్గాలు భావిస్తున్నాయి. అదనపు కొనుగోళ్లతో కొనుగోలు కేంద్రాలపై ఒత్తిడి కూడా తగ్గే అవకాశం ఉందని పేర్కొంటున్నాయి. కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి పీయూష్ గోయల్‌ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్.. తెలంగాణ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ధాన్యం కొనుగోలు అంచనాను పెంచినందుకు పార్లమెంట్‌లో స్వయంగా కలిసి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అలాగే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి కూడా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇక తెలంగాణ ధాన్యం కొనుగోళ్లను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కూడా స్వాగతించారు. తెలంగాణలో అధిక దిగుబడులు వచ్చే అవకాశాలను ముందుగానే గుర్తించి బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు లక్ష్యాన్ని పెంచాలని చేసిన విజ్ఞప్తికి కేంద్రం స్పందించిందన్నారు. ఇక.. తెలంగాణకు అదనంగా కేటాయించిన ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సూచించారు. గత మార్కెటింగ్ సీజన్లలో భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)కి బియ్యం అప్పగింపులో జాప్యం జరిగిందని గుర్తు చేసిన కిషన్ రెడ్డి.. ఈసారి మాత్రం నిర్ణీత గడువులోగా మొత్తం బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అందజేసేలా సమర్థవంతంగా కొనుగోళ్లు నిర్వహించాలని కోరారు. రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోలు ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని సూచించారు.

## గాంధీ వర్సెస్ గాడ్సే

మొదటి పేజీ తరువాయి

బూనుతున్నానని ఆయన వెల్లడించారు. బీజేపీ గాడ్సే వారసత్వానికి ప్రతీక అయితే, కాంగ్రెస్ పార్టీ మహాత్మా గాంధీ సిద్ధాంతాలను పుణికిపుచ్చుకున్న వారసత్వం కలిగిన పార్టీ అని ఆయన వ్యాఖ్యానించారు. నరేంద్ర మోదీ, ధర్మేంద్ర ప్రధాన్ కలిసి ఈ దేశాన్ని దోచుకోవడానికి ప్రయత్నిస్తున్నారని రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో వారిని ఏమాత్రం విజయం సాధించనివ్వబోమని హెచ్చరించారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో వీధుల నుంచి పార్లమెంటు వరకు పోరాటం సాగించి బీజేపీని ఓడిస్తామన్నారు. యువత భవితవ్యంతో, దేశ భవిష్యత్తుతో మోదీ చెలగాటమాడుతున్నారని ఆయన మండిపడ్డారు. నీట్ పరీక్షలో చోటుచేసుకున్న అక్రమాలపై నిరసనలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)తో పాటు ఇతర విపక్షాలు కూడా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నాయి. ఈ పరిణామాల వల్ల విద్యార్థులు మానసికంగా, విద్యాపరంగా తీవ్రంగా నష్టపోతున్నారని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థపై ప్రజలకు తిరిగి నమ్మకం కలిగించాలంటే తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలంటూ ఇప్పటికే పలు వర్గాల నుంచి డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. పరీక్షల నిర్వహణలో లోపాలు జరిగాయని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించి, భవిష్యత్తులో సంస్కరణలు చేపడతామని ప్రకటించినప్పటికీ, విపక్షాలు మాత్రం కేంద్ర మంత్రిపై వేటు వేయాల్సిందేనని పట్టుబడుతున్నాయి.

## అవినీతి ముత్యం

మొదటి పేజీ తరువాయి

గుర్తించారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం ఈ విలువ లెక్కించగా.. బహిరంగ మార్కెట్‌లో ఆస్తుల విలువ రూ. వందల కోట్లలో ఉండే అవకాశముందని ఏసీబీ అధికారులు భావిస్తున్నారు. ఈ ఏసీబీ అధికారుల సోదాల్లో 2 కిలోలకు పైగా బంగారు ఆభరణాలతోపాటు.. రూ. 52 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. వీటితోపాటు.. వజ్రాభరణాలు, విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులు, విదేశీ మద్యం సీసాలు సీజ్ చేశారు. కియా, మహీంద్రా, బలెనో కంపెనీలకు చెందిన 3 కార్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి ప్రాంతాల్లో నివాస ఫ్లాట్లు, కమర్షియల్ భవనాలు, గుట్టల బేగంపేట్‌లో జీ౦5 భవనం, మూసాపేట్‌లో రూ. 20 కోట్ల వ్యయంతో నిర్మాణంలో ఉన్న 10 అపార్ట్‌మెంట్లతో పాటు ముత్యం వెంకటరమణ భార్య స్వప్న పేరుతో నిర్మాణ రంగంలో భారీ పెట్టుబడులు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ప్రస్తుతం రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (రెడ్కో)లో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న ముత్యం వెంకటరమణ.. గతంలో కూడా 2019లో లంచం కేసులో ఏసీబీకి చిక్కిన విషయం వెలుగులోకి వచ్చింది. అప్పటి నుంచి ఆయనపై నిఘా కొనసాగించినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న పత్రాలు, బ్యాంకు ట్రాన్సాక్షన్లు, స్థిరాస్తుల రికార్డులను పరిశీలిస్తూ.. ముత్యం వెంకటరమణ అక్రమాస్తుల కేసులో మరింత లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు.

## అంతా టైం వేస్ట్ యవ్వారం

మొదటి పేజీ తరువాయి

కోర్టు ఈ విషయాన్ని సుమోటోగా స్వీకరించాలని కోరారు. అయితే ధర్మాసనం అందుకు స్పష్టంగా నిరాకరించింది. “మా సమయాన్ని వృథా చేయకండి, మీ సమయాన్ని కూడా పాడుచేసుకోకండి” అని లాయర్‌కు సీజేఐ హితవు పలికారు. నీట్-యుజీ 2026 పేపర్ లీక్, పరీక్షల నిర్వహణ తీరు, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)లో సంస్కరణలు వంటి ప్రజా ప్రాముఖ్యత ఉన్న అంశాలపైనే విద్యార్థులు ఆందోళన చేస్తున్నారని న్యాయవాది వాదించగా, “థ్యాంక్యూ వెరీ మచ్” అంటూ సీజేఐ ఆయన వాదనను అక్కడితో ముగించారు. అనంతరం, పోలీసుల అతిక్రమణలకు సంబంధించి లభ్యమైన వీడియోలను పరిశీలించాలని లాయర్ మళ్లీ కోరగా, “మాకు సమయం లేదు, ఆ వీడియోలు మేం చూడాలనుకోవడం లేదు” అని సీజేఐ తేల్చి చెప్పారు.

## నేల తల్లికి దూపైతున్నది!

మొదటి పేజీ తరువాయి

సూచించారు. గతేడాదితో పోలిస్తే రాష్ట్రంలో భూగర్భ జలమట్టం సుమారు ఒక మీటర్ మేర క్షీణించిందని ఆయన తెలిపారు. రైతుల ప్రయోజనార్థం జిల్లా స్థాయి ప్రత్యేక సలహాలను, పంటల యాజమాన్య వ్యూహాలను సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తెలంగాణ ప్రభుత్వం 27 మంది సభ్యులతో ఒక ఉన్నతస్థాయి నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి. చిన్నారెడ్డి అధ్యక్షతన బుధవారం ప్రజా భవన్‌లో ఈ కమిటీ తొలిసారిగా సమావేశమైంది. భారత వాతావరణ విభాగం, ఇక్రిశాట్, ఇకార్-క్రిడా, నాబార్డ్, వ్యవసాయ, ఉద్యానవన విశ్వవిద్యాలయాలతో పాటు పలు ప్రముఖ సంస్థల నిపుణులు ఇందులో సభ్యులుగా ఉన్నారు. ఈ సమావేశంలో వాతావరణ మార్పులను తట్టుకునే వ్యవసాయ విధానాలు, పంటల మార్పిడి, కరవును తట్టుకునే చిరుధాన్యాల సాగు, సమర్థవంతమైన నీటి యాజమాన్యం, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు వంటి కీలక అంశాలపై నిపుణులు సుదీర్ఘంగా చర్చించారు.

## రాహుల్, రేవంత్ ధర్నాలు డ్రామాలు

మొదటి పేజీ తరువాయి

అని కొట్టిపారేశారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ, తెలంగాణలో రేవంత్ రెడ్డి చేపట్టిన ధర్నాలన్నీ కేవలం రాజకీయ నాటకాలేనని బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌ను ప్రజలు ప్రతిపక్షంగా కూడా చూడటం లేదని, సీజేపీతో పోటీ పడేందుకే ఈ తరహా నిరసనలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. మరోవైపు, తెలంగాణలో సాగునీరు లేక పంట పొలాలు ఎండిపోతుంటే, ఎరువులు అందక రైతులు అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరసనలు మాని వెంటనే రైతులకు నీరందించి, ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

## రేపు స్కూళ్లు, కాలేజీలు బంద్

మొదటి పేజీ తరువాయి

ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, పీడీఎస్‌యూ, ఏఐఎఫ్‌డీఎస్, ఏఐఎస్‌బీ, ఏఐపీఎస్‌యూ తదితర విద్యార్థి సంఘాలు ఈ బంద్‌కు మద్దతు తెలుపుతున్నాయి. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. పరీక్షల నిర్వహణలో జరిగిన వైఫల్యాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పరీక్షల నిర్వహణ సంస్థ అయిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ను రద్దు చేయాలని కోరారు. ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థులపై జరిగిన పోలీసుల చర్యలపై పారదర్శక విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కూడా డిమాండ్ చేశారు. విద్యా వ్యవస్థ స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే విధంగా ఉందని ఆరోపిస్తూ ప్రతిపాదిత వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ (వీబీఎస్ఏ) బిల్లును వెనక్కి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. విద్యార్థుల ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాలని.. వారి నిరసన తెలిపే హక్కును అణచివేయరాదని స్పష్టం చేశాయి. ఈనెల 24వ తేదీన చేపట్టే బంద్‌కు రాష్ట్రంలోని విద్యాసంస్థల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు సహకరించి విజయవంతం చేయాలని విద్యార్థి సంఘాల నేతలు విజ్ఞప్తి చేశారు. అయితే, ఈ బంద్‌కు ప్రభుత్వం అధికారికంగా సెలవు ప్రకటించలేదు. బంద్ ప్రభావం మేరకు కొన్ని విద్యాసంస్థలు స్వచ్ఛందంగా తరగతులను నిలిపివేసే అవకాశం ఉంది.



## వేములవాడ బైపాస్ రోడ్డుకు మరమ్మతులు

వేములవాడ అర్బన్, జూలై 22 (ఈవార్తలు): వేములవాడ పట్టణంలోని ప్రధాన బ్రిడ్జి రెండో బైపాస్ మూలమలుపు వద్ద దెబ్బతిన్న రహదారికి ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో మరమ్మతు పనులు చేపట్టారు. ఈ ప్రాంతంలో స్వల్ప వర్షానికే నీరు నిలిచిపోవడంతో రహదారి గుంతలమయంగా మారి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ బైపాస్ మార్గం ద్వారా కోరుట్ల వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు, గూడ్స్ లారీలు, ప్యాసింజర్ ఆటోలు సహా భారీ సంఖ్యలో వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. మరమ్మతు పనులు పూర్తయితే గుంతల సమస్య తొలగి రవాణా మరింత సురక్షితంగా, సౌకర్యవంతంగా మారుతుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు మరమ్మతు పనులను ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు, సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు.



## రైతులకు సాగు మెళకువలు చెప్పాలి

**వ్యవసాయ విద్యార్థులకు గరిమ అగ్రవాల్ సూచన**

చందుర్తి, జూలై 22 (ఈవార్తలు): ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులకు క్షేత్రస్థాయిలో వ్యవసాయ మెళకువలను వివరించి, తక్కువ నీటితో సాగు చేసే ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ వ్యవసాయ కళాశాల విద్యార్థులకు సూచించారు. చందుర్తి మండలం మల్యాల గ్రామంలో నిర్వహించిన గ్రామసభ అనంతరం, అక్కడికి వచ్చిన ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. వ్యవసాయ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు తాము నేర్చుకున్న శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను క్షేత్రస్థాయిలో రైతులకు చేరవేయడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. పుస్తకాలకే పరిమితం కాకుండా గ్రామాల్లో రైతులను నేరుగా కలుసుకుని వారి సమస్యలను తెలుసుకొని, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా శాస్త్రీయ పరిష్కారాలను సూచించాలని అన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా ప్రత్యామ్నాయ పంటల సాగు ప్రయోజనాలు, సాగు విధానాలను వారికి వివరించాలని కలెక్టర్ సూచించారు. విత్తనాల విత్తే సమయం, తక్కువ నీటిని సమర్థవంతంగా వినియోగించే పద్ధతులు వంటి అంశాలను రైతులకు సులభంగా అర్థమయ్యే రీతిలో తెలియజేయాలని, ప్రతి విద్యార్థి కనీసం ఒక గ్రామాన్ని లేదా కొంతమంది రైతులను దత్తత తీసుకుని వ్యవసాయ అవగాహన కల్పించేలా కృషి చేయాలని గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు.

## ఎల్-నీనోపై రైతులకు అవగాహన

జగిత్యాల, జూలై 22 (ఈవార్తలు): ఎల్–నీనో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని ఆత్మ డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుధాకర్ సూచించారు. వెల్గటూర్ రైతువేదికలో ఆత్మ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తక్కువ నీటితో సాగయ్యే జొన్న, పెసలు, మినుములు, కంది, పొద్దుతిరుగుడు, ఆముదం వంటి పంటలను సాగు చేయాలని సూచించారు. పచ్చిరొట్ట ఎరువుల వినియోగంతో నేలలో తేమ పెరిగి నీటి వినియోగం తగ్గుతుందని తెలిపారు. రైతులు ఫార్మ్ పాండ్లు ఏర్పాటు చేసుకుని నీటిని ఆదా చేయాలని మండల వ్యవసాయ అధికారి సాయికిరణ్ సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు రవళి, ఫిర్దోస్, ఉప సర్పంచ్ ప్రతాప్‌రావు, మాజీ ఉప సర్పంచ్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమంలో అర్చకుల సేవలు గొప్పవి

**డిమాండ్లపై కమిటీ సానుకూలం**

హైదరాబాద్, జూలై 22 (ఈవార్తలు): తెలంగాణ ఉద్యమంలో ఆధ్యాత్మిక రంగాన్ని ఏకం చేసి స్వరాష్ట్ర కాంక్షను రగిలించిన అర్చకులు, గిరిజన అర్చకులతో 'తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ' బుధవారం అమరవీరుల స్మారక చిహ్నం (అమరదీపం) వద్ద సమావేశమైంది. ఈ భేటీలో కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, మోతె శోభన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్ పాల్గొని అర్చకుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఉద్యమంలో ఆధ్యాత్మిక చైతన్యం ద్వారా వారు పోషించిన పాత్రను ఈ సందర్భంగా సభ్యులు కొనియాడారు. ఈ నేపథ్యంలో అర్చకులు కమిటీ ముందు పలు ప్రతిపాదనలు ఉంచారు. 'ఆలయాల నిర్వహణ కోసం ప్రభుత్వం అందిస్తున్న 'ధూప దీప నైవేద్యం' ఆర్థిక సాయాన్ని తక్షణమే పెంచాలి. అర్చకుల పిల్లలకు వేద విద్యతో పాటు నాణ్యమైన సాధారణ విద్యను పూర్తిగా ఉచితంగా అందించాలి. నిరుపేద గిరిజన, ఇతర అర్చక కుటుంబాలకు 250 గజాల నివాస భూమిని కేటాయించి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయాలి. అత్యవసర పరిస్థితుల్లో అపరిమిత ఉచిత వైద్యం అందేలా ప్రత్యేక డిజిటల్ హెల్త్ కార్డులు జారీ చేయాలి' అని కోరారు. ఈ వినతులపై స్పందించిన కమిటీ సభ్యులు.. భత్యం పెంపుదల, ఉచిత విద్య, ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డుల కోసం అర్చక స్వాములు కోరిన ప్రతి డిమాండ్ అత్యంత న్యాయమైనదని స్పష్టం చేశారు.

## రాహుల్‌వి విచ్ఛిన్నకర రాజకీయాలు

**టీబీజేపీ చీఫ్ రాంచందర్ రావు ఫైర్**

హైదరాబాద్, జూలై 22 (ఈవార్తలు): కాంగ్రెస్ పార్టీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అవలంబిస్తున్న దేశవ్యతిరేక, విచ్ఛిన్నకర రాజకీయాలు చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్ రావు విమర్శించారు. కాంగ్రెస్ నాయకత్వంపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంటు కీలక సమావేశాలు జరుగుతున్న సమయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన రాహుల్ గాంధీ, సభను బహిష్కరించి వీధి నాటకాలకు తెరలేపారని విమర్శించారు. నీట్ పరీక్ష లీకేజీ అంశంపై సభలో చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేసినప్పటికీ, సమాధానం చెప్పలేక చర్చ నుంచి పారిపోయిన రాహుల్ గాంధీ, ప్రధాని నివాసం ముట్టడికి దిగడం ఆయన అపరిపక్వతకు, చట్టసభల పట్ల ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు.

# బీజేపీ అంటే బ్రిటిష్ జాహిల్ పార్టీ

**సీసీ కెమెరాలు ఆపేసి.. ఇంటర్ నెట్ షట్ డౌన్ చేసి విద్యార్థులపై పైశాచికం**

**నాటి బ్రిటిష్ ప్రభుత్వం దాష్టీకాలనే నేడు బీజేపీ చేస్తోంది**

**తెలంగాణ రక్షణ చీఫ్ కల్వకుంట్ల కవిత**



హైదరాబాద్, జూలై 22 (ఈవార్తలు): బీజేపీ అంటే భారతీయ జనతా పార్టీ కాదు బ్రిటీష్ జాహిల్ పార్టీ అని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. ఢిల్లీలో నీట్ ఎగ్జామ్ పేపర్ లీకేజీని నిరసిస్తూ ఆందోళన చేస్తున్న విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరు ప్రపంచం ముందు సిగ్గుతో తలదించుకునేలా ఉందన్నారు. బుధవారం ఈమేరకు వీడియో సందేశం విడుదల చేశారు. పరీక్షలు ఫెయిర్ గా నిర్వహించాలని నిరసన తెలిపితే సీసీ కెమెరాలు ఆపేసి, ఇంటర్ నెట్ షట్ డౌన్ చేసి విద్యార్థుల వీపులపై లాఠీలు ఝుళిపించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆనాడు బ్రిటిష్ ప్రభుత్వం మనపై ఏ విధంగా దాష్టీకాలకు పాల్పడిందో ఇప్పుడు బీజేపీ కూడా సొంత ప్రజలపై అదే విధంగా దాష్టీకాలు చేస్తుందన్నారు. విద్యార్థులపై పాశవికంగా చేసిన దాడికి బీజేపీ ప్రభుత్వం వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వలస పాలనలో బ్రిటీష్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ఎంత మూర్ఖంగా దాడులు చేశారో ఇప్పుడు బీజేపీ అంతే మూర్ఖంగా వ్యవహరిస్తోందన్నారు. గతంలో రైతులపై ఇప్పుడు విద్యార్థులపై పైశాచికంగా చేసిన దాడులను దేశం మొత్తం గమనిస్తోందన్నారు. సీసీటీవీ కెమెరాలు ఆపేసి, ఇంటర్ నెట్ షట్ డౌన్ చేసి విద్యార్థులపై అమానుషంగా లాఠీ ఛార్జ్ చేశారని అన్నారు. విద్యార్థినులను రోడ్డుపై పరుగెత్తించుకుంటూ రక్తాలు వచ్చేలా కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసుల దాడిలో 90 మంది తీవ్రంగా గాయపడ్డారని, ఒక విద్యార్థిని ఐసీయూలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. ఆనాడు బ్రిటీష్ వాళ్లు కూడా మన స్వేచ్ఛ ను హరించి, ప్రశ్నిస్తే దాడులు చేశారని, ఆనాటి పాలనను బీజేపీ గుర్తు తెస్తుందని కవిత మండిపడ్డారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రశ్నించటం పౌరులకు ఉన్న హక్కు అని గుర్తు చేశారు. ప్రజలకు సమాధానం చెప్పలేని ఈ బీజేపీకి ఒక్క క్షణం కూడా అధికారంలో ఉండే హక్కు లేదన్నారు. శాంతియుతంగా ఆందోళన చేస్తోన్న విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరుతో ప్రపంచం ముందు భారత్ సిగ్గుతో తలదించుకునే పరిస్థితి వచ్చిందని కవిత అన్నారు. విద్యార్థులపై క్రూరంగా వ్యవహరించినందుకు దేశ ప్రజలకు బీజేపీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

**లాఠీ దెబ్బలకు, రక్తం చుక్కలకు సమాధానం తప్పదు**

నీట్ ఎగ్జామ్ నిర్వహించడం చేతకాని కేంద్రం ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జులుం ప్రదర్శించడం ఏమిటని ప్రశ్నించారు. నీట్ ఎగ్జామ్ పేపర్ లీకేజీ కారణంగా 25 లక్షల మంది విద్యార్థులు నష్టపోయారని, 21 మంది ఆత్మహత్య చేసుకున్నారని చెప్పారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలను కేంద్రం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై పోలీసుల దాడిని చూసి దేశం మొత్తం నిశ్చేష్టులయ్యారని అన్నారు. పేపర్ లీకేజీ ఘటనలకు బాధ్యత ఎవరిది? విద్యార్థుల చావులకు ఎవరు సమాధానం చెబుతారని ప్రశ్నించారు. విద్యార్థులు చిందించిన ప్రతి రక్తం బొట్టుకు, వారిపై విరిగిన లాఠీలకు దేశం మొత్తం కచ్చితంగా ఓటు రూపంలో జవాబు చెబుతుందని హెచ్చరించారు. పేపర్ లీక్ చేసిన వాళ్లను గుర్తించి వారిపై అత్యంత కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఏ మాత్రం పారదర్శకత లేకుండా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. విద్యార్థుల ఆందోళనకు మద్దతుగా హంగర్ స్ట్రైక్ చేస్తున్న సోనమ్ వాంగ్ చుక్ ఆరోగ్య పరిస్థితిని ప్రజలకు చెప్పాలన్నారు. విద్యార్థులు ధైర్యం కోల్పోకుండా సామరస్యంగా ఉండాలన్నారు. ఈ సిస్టమ్ మార్చేందుకు విద్యార్థుల తరపున రాజకీయ పార్టీలు, మేధావులు, ప్రజా సంఘాలు పోరాటం చేస్తాయన్నారు.

**గిగ్ వర్కర్ల బతుకు దయనీయం**

స్విగ్గీ, జొమాటో, ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి సంస్థల్లో పనిచేస్తున్న లక్షలాది మంది డెలివరీ వర్కర్లు, ఆటో, క్యాబ్ డ్రైవర్ల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. రోజంతా కష్టపడినా వారికి వచ్చే ఆదాయం కుటుంబ పోషణకు కూడా సరిపోవడం లేదని అన్నారు. గత మూడేళ్లుగా ఛార్జీలు పెంచాలని అడుగుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, వారి పట్ల నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. అగ్రిగేటర్ సంస్థలు భారీగా కమీషన్ల కోత విధిస్తూ, అన్యాయంగా రేట్లను నియంత్రిస్తుండటంతో డ్రైవర్లు, డెలివరీ బాయ్స్ ఆర్థిక నష్టాల్లో కూరుకుపోతున్నారని తెలిపారు. గిగ్ వర్కర్లు, డ్రైవర్ల పక్షాన ప్రభుత్వం నిలబడాలని, వెంటనే అగ్రిగేటర్ సంస్థలతో చర్చలు జరిపి ఛార్జీలు పెంచేలా చర్యలు తీసుకోవాలని కవిత డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం వీరంతా 'వర్క్ బ్రేక్ డౌన్' వంటి నిరసనబాట పట్టే పరిస్థితి తెప్పించకుండా ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు. గిగ్ వర్కర్లు చేస్తున్న ఈ న్యాయమైన పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ పూర్తి మద్దతుగా ఉంటుందని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు.

# తెలంగాణలో కొత్త లిఫ్ట్ చట్టం

**త్వరలో అసెంబ్లీ ముందుకు**

హైదరాబాద్, జూలై 22 (ఈవార్తలు): రాష్ట్రంలో తరచూ చోటుచేసుకుంటున్న లిఫ్ట్ ప్రమాదాలను నివారించేందుకు తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. లిఫ్టులు, ఎస్కలేటర్లు, మూవింగ్ వాక్స్ భద్రతను మరింత పటిష్టం చేసేలా.. 'తెలంగాణ లిఫ్ట్‌లు, ఎస్కలేటర్లు, మూవింగ్ వాక్స్ బిల్లు' ముసాయిదాను రెడీ చేసింది. ఈ ముసాయిదా బిల్లుకు ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆమోదం తెలపగా.. న్యాయశాఖ పరిశీలన తర్వాత మంత్రివర్గం ఆమోదానికి పంపించనున్నారు. ఆ తర్వాత ఈ బిల్లును అసెంబ్లీ ముందుకు తీసుకురానున్నారు. లిఫ్ట్‌లలో సాంకేతిక లోపాల కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో ప్రజల భద్రతపై తీవ్ర ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో లిఫ్ట్ భద్రతపై ప్రత్యేక చట్టం తీసుకురావాలని హైకోర్టులో దాఖలైన ప్రజాహిత వ్యాజ్యానికి (పిల్) రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన అఫిడవిట్‌లో ఈ ముసాయిదా బిల్లుకు సంబంధించిన వివరాలను వెల్లడించింది. కొత్త చట్టం అమల్లోకి వస్తే రాష్ట్రంలో లిఫ్ట్‌లు తయారు చేసే సంస్థలు తప్పనిసరిగా రాష్ట్ర ప్రభుత్వం వద్ద నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. భవనాలు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాలు, విద్యాసంస్థలు, ఆస్పత్రులు, నివాస గృహాల్లో ఏర్పాటు చేసే ప్రతి లిఫ్ట్, ఎస్కలేటర్, మూవింగ్ వాక్ భారతీయ ప్రమాణాల సంస్థ నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలి. అలాగే రాష్ట్ర ప్రభుత్వం నియమించే ఇన్‌స్పెక్టర్లు.. ప్రతి ఏడాది లిఫ్ట్‌లు, ఎస్కలేటర్లు, మూవింగ్ వాక్స్‌ను తనిఖీ చేసి భద్రతా ప్రమాణాలను పరిశీలిస్తారు. గుర్తింపు పొందిన సాంకేతిక నిపుణులు లేదా అధీకృత సంస్థల ద్వారానే నిర్వహణ, మరమ్మతులు చేపట్టేలా ప్రత్యేక నిబంధనలు అమలు చేయనున్నారు. లిఫ్ట్ తయారీలో లేదా నిర్వహణలో నాణ్యత లోపాలు ఉన్నట్లు తేలితే సంబంధిత తయారీ సంస్థలపై వినియోగదారుల ఫోరంలో కేసులు నమోదు చేసే అవకాశం కూడా ఈ చట్టం కల్పించనుంది. దీంతో తయారీ సంస్థలు, నిర్వహణ సంస్థలు భద్రతా ప్రమాణాల విషయంలో మరింత బాధ్యతగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఈ ప్రతిపాదిత చట్టాన్ని తెలంగాణ ఎలివేటర్స్ అసోసియేషన్ స్వాగతించింది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇలాంటి బిల్లు సిద్ధమైందని అసోసియేషన్ అధ్యక్షుడు అవినాష్ చల్లా తెలిపారు. లిఫ్ట్‌లను అత్యవసర సేవలుగా గుర్తించి.. ప్రస్తుతం అమల్లో ఉన్న 18 శాతం జీఎస్టీని తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. దీంతో లిఫ్ట్‌ల ఏర్పాటు, నిర్వహణ వ్యయం తగ్గడంతో పాటు భద్రతా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని అభిప్రాయపడ్డారు.

# సీసీఐపై సప్పుడు చేయవేం?

**నా ప్రశ్నలకు సమాధానం చెప్పు.. రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ**



హైదరాబాద్, జూలై 22 (ఈవార్తలు): ఆదిలాబాద్‌లోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కర్మాగారం పునరుద్ధరణపై కాంగ్రెస్ ప్రభుత్వం తన అధికారిక వైఖరిని స్పష్టం చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. సీసీఐ పునరుద్ధరణ అనేది కేవలం ఒక పరిశ్రమకు సంబంధించిన అంశం మాత్రమే కాదని ఇది వేలాది కుటుంబాల జీవనాధారం, ఆదిలాబాద్ జిల్లా పారిశ్రామిక భవిష్యత్తు, తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన అత్యంత కీలకమైన అంశం అన్నారు. ఈ మేరకు కేటీఆర్ ఇవాళ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. ఇటీవలే ఢిల్లీ వెళ్లి కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామిని కలిసిన విషయాన్ని కేటీఆర్ లేఖలో గుర్తుచేశారు. సీసీఐ ఆదిలాబాద్ ప్లాంట్ పునరుద్ధరణకు తెలంగాణ ప్రభుత్వం రూ.250 కోట్ల పెట్టుబడితో ముందుకు వస్తే ప్రక్రియ సాధ్యమవుతుందని కేంద్ర మంత్రి స్పష్టంగా వెల్లడించారని అయితే రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి రాయితీలు కానీ, సహాయ సహకారాలపై అధికారిక ప్రతిపాదనలు అందకపోవడం వల్లే జాప్యం జరుగుతోందని మంత్రి చెప్పినట్లు కేటీఆర్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర సర్కారు స్పందన కోసం ఎదురుచూస్తున్న ఈ పరిస్థితుల్లో ఇప్పటి వరకు మీ ప్రభుత్వ వైఖరిని ప్రకటించకపోవడం అత్యంత విచారకరం అని, గత రెండున్నరేళ్లుగా మీ కాంగ్రెస్ ప్రభుత్వంలో చిత్తశుద్ధి లేకపోవడం వల్లే ఈ విషయంలో జాప్యం జరుగుతోందనే విషయం తేటతెల్లమైందన్నారు. ఆదిలాబాద్ వంటి వెనుకబడిన జిల్లాలో వేలాది మందికి ఉపాధి కల్పించే పరిశ్రమ విషయంలో ప్రభుత్వం చూపుతున్న ఈ నిర్లక్ష్యం ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో ఈ అంశంపై పూర్తి చిత్తశుద్ధితో పనిచేసిందని పేర్కొన్నారు. మా ప్రభుత్వం నాడు అన్ని విధాలా సిద్ధంగా ఉన్నప్పటికీ, నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ గారికి, బీఆర్ఎస్ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే నెపంతో అప్పటి కేంద్ర ప్రభుత్వం ప్లాంట్‌ను పునరుద్ధరించలేదన్నారు. ఆదిలాబాద్ ప్రజల ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకుని, రాజకీయాలకు అతీతంగా ఈ అంశంపై వెంటనే సానుకూల నిర్ణయం తీసుకుని కేంద్ర ప్రభుత్వానికి అవసరమైన ప్రతిపాదనలు పంపాలని, సీసీఐ పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం తన పూర్తి సహకారాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రితో పాటు, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు గారు సమయం కేటాయిస్తే, సీసీఐ సాధన సమితి ఆధ్వర్యంలో కలిసి వినతి పత్రం సమర్పించడానికి కూడా సిద్ధంగా ఉన్నామన్నారు. తెలంగాణ ప్రజల తరఫున, ముఖ్యంగా ఆదిలాబాద్ వాసుల పక్షాన ముఖ్యమంత్రి ఈ ఆరు అంశాలపై స్పష్టత ఇవ్వాలని కేటీఆర్ కోరారు.

# ఆగస్టు 3 వరకు పాత అక్రెడిటేషన్ల చెల్లుబాటు

హైదరాబాద్, జూలై 22 (ఈవార్తలు): తెలంగాణలో ప్రస్తుతం అమల్లో ఉన్న జర్నలిస్టుల అక్రెడిటేషన్ కార్డుల చెల్లుబాటును ఆగస్టు 3 వరకు పొడిగిస్తూ తెలంగాణ హైకోర్టు మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ుఖఔజీఫీ)తో పాటు పలువురు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు, తదుపరి విచారణ జరిగే వరకు ప్రస్తుతం ఉన్న అక్రెడిటేషన్ కార్డులు చెల్లుబాటులోనే ఉంటాయని స్పష్టం చేసింది. అదేవిధంగా, అక్రెడిటేషన్ గడువు పొడిగింపు కోరుతున్న జర్నలిస్టుల జాబితాను కోర్టుకు సమర్పించాలని పిటిషనర్లను హైకోర్టు ఆదేశించింది. ఈ కేసు తదుపరి విచారణను ఆగస్టు 3కు వాయిదా వేస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.



## కాంగ్రెస్ ర్యాలీ.. పీసీసీ చీఫ్ అరెస్టు

హైదరాబాద్, జూలై 22 (ఈవార్తలు): కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా.. దేశరాజధాని ఢిల్లీలో రాహుల్ గాంధీ సహా ప్రధాన ప్రతిపక్ష నాయకుల అరెస్టును తీవ్రంగా ఖండిస్తూ తెలంగాణ వ్యాప్తంగా తీవ్ర స్థాయిలో ఆందోళనలు వ్యక్తం అయ్యాయి. ఏఐసీసీ ఆదేశాల మేరకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ప్రత్యక్ష నేతృత్వంలో రాజధాని హైదరాబాద్‌లో 'ఛలో లోక్‌భవన్' కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌లోని ప్రముఖ నెక్లెస్ రోడ్ ప్రాంతం నుంచి లోక్‌భవన్ వైపు వేలాది మంది కాంగ్రెస్ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీగా బయలుదేరారు. ఈ ప్రదర్శనలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో పాటు రాష్ట్ర కేబినెట్ మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ కీలక నేత అజారుద్దీన్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ర్యాలీని ముందుకు తీసుకెళ్లారు. ర్యాలీ లోక్‌భవన్‌కు చేరుకున్న క్రమంలో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. లోక్‌భవన్ ముట్టడికి యత్నించిన నాయకులను అడ్డుకున్న పోలీసులు.. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలతో పాటు అక్కడ ఉన్న ముఖ్య నాయకులను బలవంతంగా అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. మరోవైపు హనుమకొండలో సైతం ఏఐసీసీ పిలుపు మేరకు కాంగ్రెస్ శ్రేణులు విస్తృతంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టాయి. ఈ నిరసన ప్రదర్శనలో రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జిల్లాకు చెందిన మంత్రి కొండా సురేఖలతో పాటు పలువురు స్థానిక శాసన సభ్యులు (ఎమ్మెల్యేలు), ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్ర ప్రభుత్వ వైఖరిపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.

## ఏపీలో తల్లికి వందనం నిధుల విడుదల

మంగళగిరి, జూలై 22 (ఈవార్తలు): విద్యార్థుల భవిష్యత్తుకు భరోసానిస్తూ ఏపీలోని కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన 'తల్లికి వందనం' పథకం నిధులు విడుదలయ్యాయి. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 42.70 లక్షల మంది అర్హులైన తల్లుల ఖాతాల్లో రూ.10,120.78 కోట్లను ప్రభుత్వం జమ చేస్తోంది. ప్రతి విద్యార్థి తల్లికి రూ.13,000 చొప్పున అందుతున్న ఈ నిధుల జమ ప్రక్రియ ఈ నెల 24వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ... నూతన విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ఈ ఆర్థిక సాయాన్ని అందజేయడం వల్ల విద్యార్థుల చదువులకు ఎటువంటి అవాంతరాలు ఎదురుకావని అన్నారు. పిల్లలే మన అసలైన సంపదని, వారి చదువులే కుటుంబానికి తరగని ఆస్తి అని వ్యాఖ్యానించారు. గతంలో ఉన్న ఆంక్షలను తొలగించి, ఒక ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే అంతమందికీ ఈ పథకం ఫలాలను వేర్వేరుగా వర్తింపజేస్తున్నట్లు స్పష్టం చేశారు.


# డ్రగ్స్‌తో భవిత బుగ్గిపాలు

## విద్యార్థులకు వక్తల పిలుపు.. సీబీసీ ఆధ్వర్యంలో 'నషా ముక్త్ భారత్ అభియాన్'

నిజామాబాద్, జూలై 22 (ఈవార్తలు): యువత మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండి విద్య, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని ఈగల్ ఫోర్స్ డీఎస్పీ ఎం. సోమనాథం పిలుపునిచ్చారు. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ), నిజామాబాద్ ఆధ్వర్యంలో గిర్‌రాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'నషా ముక్త్ భారత్ అభియాన్' సందర్భంగా మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ సోమనాథం మాట్లాడుతూ, కేవలం సరదాగా ఒక్కసారి డ్రగ్స్‌ను వినియోగించినా అది వ్యసనంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రాబోయే ఐదు నుంచి ఏడు సంవత్సరాలను విద్యాభ్యాసం, నైపుణ్యాల పెంపుదలకు వినియోగించి స్పష్టమైన లక్ష్యాలతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. ఆరోగ్యం, విద్య, ఉపాధి, కుటుంబ జీవితాన్ని మాదకద్రవ్యాలు తీవ్రంగా దెబ్బతీస్తాయని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి. రామ్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమానికి రాయబారిగా మారాలని కోరారు. తోటి వారి ఒత్తిడికి లొంగకుండా కుటుంబ సభ్యులు, సమాజంలో అవగాహన కల్పించాలని, డ్రగ్-ఫ్రీ తెలంగాణ లక్ష్య సాధనలో భాగస్వాములు



కావాలని పిలుపునిచ్చారు. సీబీసీ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ శివచరణ్ రెడ్డి మాట్లాడుతూ, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, చట్టపరమైన పరిణామాలపై యువతలో అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. "డ్రగ్స్‌కు నో... జీవితానికి యెస్" అనే సందేశాన్ని ప్రతి విద్యార్థి ఆచరణలో పెట్టాలని సూచించారు. ఈగల్ ఫోర్స్ సబ్ ఇన్‌స్పెక్టర్ సందీప్ మాట్లాడుతూ, డ్రగ్ మాఫియా ప్రధానంగా యువతనే లక్ష్యంగా చేసుకుంటోందని, మాదకద్రవ్యాల అక్రమ రవాణా ద్వారా సమకూరే నిధులు నేర, ఉగ్రవాద కార్యకలాపాలకు వినియోగించబడుతున్నాయని తెలిపారు. విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సాంగ్ అండ్ డ్రామా బృందం 'పల్లె సుద్దులు' జానపద కళారూపం ద్వారా మాదకద్రవ్యాల వ్యతిరేక సందేశాన్ని ఆకట్టుకునే రీతిలో ప్రదర్శించింది. ఈ కార్యక్రమంలో అధ్యాపకురాలు నహీదా బేగం, ఆకాశవాణి ట్రాన్స్‌మిషన్ ఎగ్జిక్యూటివ్ మోహన్ దాస్, అధ్యాపకులు, సిబ్బంది, 400 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు.



## బద్ది పోచమ్మకు ఆరెకటికల బోనాలు

### వేములవాడలో భక్తిశ్రద్ధలతో బోనాల వేడుకలు

వేములవాడ అర్బన్, జూలై 22 (ఈవార్తలు): వేములవాడ పట్టణ ఆరె కటిక సంఘం ఆధ్వర్యంలో ఆషాఢ బోనాల సందర్భంగా బద్ది పోచమ్మ తల్లి బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కోయల్కార్ మస్తాన్ ముఖ్య అతిథులుగా పాల్గొని బోనాల ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలందరూ అమ్మవారి ఆశీస్సులతో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆరె కటిక సంఘం నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాల వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ పెద్దలు మాట్లాడుతూ, బద్ది పోచమ్మ ఆలయానికి వచ్చే భక్తులు తమ మొక్కులు తీర్చుకునేందుకు గొర్రెలు, మేకలను కొనుగోలు చేస్తారని, వాటి విక్రయాల ద్వారా అనేక కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయని తెలిపారు. పోచమ్మ ఆలయం తమ జీవనాధారానికి కేంద్రబిందువుగా నిలుస్తోందని వారు పేర్కొన్నారు.



## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి: వీజేఎస్

హైదరాబాద్, జూలై 22 (ఈవార్తలు): ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని తెలంగాణ జనసమితి పార్టీ విద్యార్థి విభాగం (వీజేఎస్) రాష్ట్ర కార్యవర్గం తీవ్రంగా ఖండించింది. ఈ ఘటనకు నిరసనగా ఉస్మానియా విశ్వవిద్యాలయంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వీజేఎస్ నాయకులు మాట్లాడుతూ, విద్యార్థులపై పోలీసు దాడులు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు. తమ న్యాయమైన డిమాండ్ల కోసం శాంతియుతంగా పోరాడుతున్న విద్యార్థులపై లాఠీచార్జ్ చేయడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. ప్రశ్నించే గొంతులను అణచివేయడమే కేంద్ర ప్రభుత్వ విధానంగా మారిందని ఆరోపించారు. విద్యారంగంలో నెలకొన్న సంక్షోభానికి, విద్యార్థులపై జరుగుతున్న నిర్బంధ చర్యలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించకుండా వారిపై దాడులు చేయించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. లాఠీచార్జ్‌కు బాధ్యులైన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని, గాయపడిన విద్యార్థులకు న్యాయం చేయాలని, నమోదైన కేసులను ఉపసంహరించుకోవాలని, శాంతియుత నిరసనలను అణచివేసే నిర్బంధ విధానాలను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని వీజేఎస్ రాష్ట్ర కార్యవర్గం డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో వీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరాల ప్రశాంత్, ఉస్మానియా విశ్వవిద్యాలయ అధ్యక్షుడు రమేష్ యాదవ్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు నక్కరకంటి నరేందర్, రాష్ట్ర కార్యదర్శి జిల్లేపల్లి దిలీప్ కుమార్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎటెల్లి శేఖర్ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి డప్పు గోపి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## రజకులకు రక్షణ చట్టం తీసుకురావాలి

**చాపర్తి కుమార్ గాడ్గే డిమాండ్**

బాన్సువాడ, జూలై 22 (ఈవార్తలు): రజక (చాకలి--ధోభి) సామాజిక వర్గానికి ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావడంతో పాటు అసెంబ్లీలో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేయాలని రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్ గాడ్గే డిమాండ్ చేశారు. బాన్సువాడ మండల కేంద్రంలో నిర్వహించిన రజక సంఘం ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదికాలం నుంచి సమాజానికి పరిశుభ్రత, ఆరోగ్య సేవలు అందిస్తున్న రజకుల సేవలను గుర్తించి వారికి తగిన గౌరవం, రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. స్వచ్ఛభారత్‌కు ప్రేరణగా నిలిచిన సంత్ గాడ్గే బాబా రజక సామాజిక వర్గానికి చెందిన మహనీయుడని, తెలంగాణ విముక్తి పోరాటంలో చాకలి ఐలమ్మ పోషించిన పాత్ర చిరస్మరణీయమని పేర్కొన్నారు. వారి స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా రజకులు సంఘటిత ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. రజక మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలు, గ్రామీణ ప్రాంతాల్లో కుల బహిష్కరణ ఘటనలను అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్య, ఉద్యోగాలు, రాజకీయాలు, ఆర్థిక రంగాల్లో రజకుల అభివృద్ధికి తెలంగాణలో కూడా ఇతర రాష్ట్రాల మాదిరిగా షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో జరిగిన ఆరు హత్యలు, ఖమ్మంలో మైనర్ బాలికపై దాడి, కుమ్మెర మల్లన్న జాతరలో చిన్నారి మృతి వంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే రజక మేధావులు, మహిళలు, యువత సంఘటితంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రజక నాయకులు ముత్యాల సాయిబాబా, బురిగారి మహేష్, పర్వయ్య, కొండని గంగారాం, ఇస్తరి, కాశీరం, మెతుకు గంగారాం తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ అరెస్టుకు నిరసనగా కాంగ్రెస్ ఆందోళన

### ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి: మంత్రి అడ్లూరి

జగిత్యాల, జూలై 22 (ఈవార్తలు): కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతుందని, కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఢిల్లీలో లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ అక్రమ అరెస్టును నిరసిస్తూ జగిత్యాల తహసీల్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసనలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, స్థానిక ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు గాజంగి నందయ్య, జిల్లా లైబ్రరీ చైర్మన్ దినేష్, ఆత్మ చైర్మన్ కాటిపెల్లి గంగారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ నీట్ యూజీ పేపర్ లీకేజీతో మోడీ ప్రభుత్వానికి మూడిందని ఆరోపించారు. ప్రశ్నాపత్రం లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని, విద్యార్థులపై లాఠీచార్జికి బాధ్యత వహిస్తూ ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్ షా లు పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్టీఏ నిర్వహించే నీట్ పరీక్షకు ప్రతి ఏటా 20 లక్షలకు పైగా విద్యార్థులు హాజరవుతారని, ఈ ఏడాది 22 లక్షల 79 వేల 743 మంది రిజిస్టర్ చేసుకోగా 19 లక్షల 99 వేల 895 మంది పరీక్ష రాశారని తెలిపారు. తెలంగాణ నుంచి 73,084 మంది హాజరయ్యారని, పేపర్ లీక్ వల్ల ఇప్పటి వరకు 12 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన పరీక్షను పారదర్శకంగా నిర్వహించాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని, కానీ బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల ప్రశ్న పత్రాలు పల్లి, బాటాణీ అమ్మినట్లు అమ్మారని విమర్శించారు. లీకైన ప్రశ్నలు టెలిగ్రామ్, వాట్సాప్ ద్వారా రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు అమ్మినట్లు సీబీఐ ఆధారాలు



సేకరించిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మాట్లాడుతూ దేశంలో ఐఐఎం, ఐఐటీ,కేంద్రీయ, నవోదయ, కాకతీయ, గాంధీ మెడికల్ కాలేజీలు, జెఎన్టియు వంటి విద్యా సంస్థలకు కాంగ్రెస్ ప్రభుత్వమే పునాది వేసిందని గుర్తు చేశారు. నీట్‌ను ప్రైవేట్ సంస్థకు అప్పగించి పేపర్ లీకులకు కారణమయ్యారని, శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థులపై లాఠీచార్జి చేయడాన్ని ఖండించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేకుండా యువతను పశువుల కన్నా హీనంగా చూస్తున్నారన్నారు. నీట్ పేపర్ లీకేజీ బాధ్యులను, విద్యార్థులపై లాఠీచార్జి చేసిన వారిని తక్షణమే శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, పట్టణ మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొత్త మోహన్, మనోహర్ రెడ్డి, రవీందర్ రావు, బండ శంకర్, ఏఎంసి చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, అనిత, జిల్లా యూత్ అధ్యక్షులు బీరం రాజేష్, దయల శరత్, దుమల రాజ్ కుమార్, సతీష్, శైలేందర్ రెడ్డి, శరత్ రెడ్డి, నిశాంత్ రెడ్డి, మన్సూర్, ముజీబ్, అడువాల లక్ష్మణ్, జిల్లా కాంగ్రెస్ అనుబంధ విభాగాల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలపై 27న 'ఛలో పార్లమెంట్'

**పోస్టర్ ఆవిష్కరించిన టీడబ్ల్యూజేఎఫ్**




హైదరాబాద్, జూలై 22 (ఈవార్తలు): కేంద్ర ప్రభుత్వం పరిధిలో పరిష్కారం కావాల్సిన జర్నలిస్టుల సమస్యల సాధన కోసం ఈ నెల 27న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద 'ఛలో పార్లమెంట్' కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర నాయకులు ప్రకటించారు. హైదరాబాద్ హైదర్‌గూడలోని న్యూస్ సర్వీస్ సిండికేట్ (ఎన్ఎస్ఎస్) కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం, పార్లమెంట్ సభ్యుల దృష్టికి తీసుకెళ్లేందుకే ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. జర్నలిస్టులకు రైల్వే రాయితీ పాస్‌ల పునరుద్ధరణ, జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం, రిటైర్డ్ జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ పథకం, నేషనల్ మీడియా కమిషన్ ఏర్పాటు, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియాలకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. కోవిడ్ సమయంలో నిలిపివేసిన జర్నలిస్టుల రైల్వే రాయితీ పాస్‌లను ఇప్పటికీ పునరుద్ధరించకపోవడంతో దేశవ్యాప్తంగా పాత్రికేయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అలాగే మీడియా రంగం విస్తరణ నేపథ్యంలో ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్థానంలో 'నేషనల్ మీడియా కమిషన్' ఏర్పాటు చేయాలని కోరారు. వివిధ రాష్ట్రాల్లో రిటైర్డ్ జర్నలిస్టులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున దేశవ్యాప్తంగా ఒకే విధమైన జాతీయ పెన్షన్ పథకం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు, హత్యలు, అక్రమ కేసులను అరికట్టేందుకు పార్లమెంట్‌లో 'జర్నలిస్టుల రక్షణ చట్టం' తీసుకురావాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియాలకు పూర్తి స్థాయిలో చట్టబద్ధత కల్పించాలని, జర్నలిస్టు సంఘాలు, హౌసింగ్ సొసైటీలకు భూముల కేటాయింపుపై సుప్రీంకోర్టు తీర్పును సమీక్షించి దేశవ్యాప్తంగా పాత్రికేయులకు ఇళ్ల స్థలాల కేటాయింపుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నెల 27న జరిగే 'ఛలో పార్లమెంట్' కార్యక్రమంలో తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి జర్నలిస్టులు, టీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులతో పాటు ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్‌డబ్ల్యూజే) నాయకులు కూడా పాల్గొంటారని తెలిపారు. ధర్నా అనంతరం పలువురు కేంద్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులను కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను సమర్పించనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌డబ్ల్యూజే జాతీయ కౌన్సిల్ సభ్యుడు కుంచం శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కే. పాండురంగారావు, పి. అశోక్ కుమార్ గౌడ్, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, రంగారెడ్డి జిల్లా కో-కన్వీనర్ నంబి పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

## సర్కారు బడిలో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీలు

కోరుట్ల, జూలై 22 (ఈవార్తలు): ప్రభుత్వ పాఠశాలలను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బీఆర్ఎస్ పార్టీ రాజ్యసభ సభ్యుడి నిధులతో నిర్మిస్తున్న అదనపు తరగతి గదులను పరిశీలించారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేసి విద్యార్థులకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణ పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థుల వినియోగానికి అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు నిధులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌తో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడి కోరారు. అనంతరం పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులతో ఎమ్మెల్యే మాట్లాడారు. క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో లభిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. విద్యార్థుల చదువుకు సంబంధించిన సమస్యలు, పాఠశాలల్లోని మౌలిక వసతులపై ఆరా తీసి, అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మున్సిపల్ కార్యాలయం సమీపంలోని న్యూ బాయ్స్ హైస్కూల్, గర్ల్స్ హైస్కూల్‌లను కూడా ఎమ్మెల్యే తనిఖీ చేశారు. పాఠశాలల పరిశుభ్రత, తరగతి గదులు, తాగునీరు, మరుగుదొడ్లు తదితర మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు అందేలా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ తెలిపారు.



## దేశ వ్యతిరేక శక్తులపై ఉక్కుపాదం మోపాలి

భారత్ సురక్ష సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు

జగిత్యాల, జూలై 22 (ఈవార్తలు): దేశ వ్యతిరేక శక్తులపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని భారత్ సురక్ష సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ ఏసీఎస్ రాజు డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఢిల్లీలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జరుగుతున్న ఆందోళనల్లో విద్యార్థుల ముసుగులో అసాంఘిక శక్తులు చేరి దేశంలో అస్థిరత సృష్టించేందుకు కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. ఆందోళనల్లో రాజకీయ నాయకులు, సినీ నటులు, సామాజిక కార్యకర్తల రూపంలో దేశ వ్యతిరేక శక్తులు పాల్గొంటూ సమస్యను పక్కదారి పట్టిస్తున్నాయని అన్నారు. హిందుత్వం, హిందూ దేవుళ్లు, భారతమాతను కించపరిచేలా ప్రసంగాలు, దేశ వ్యతిరేక నినాదాలు చేయడం సరికాదన్నారు. దేశంలో అస్థిరత సృష్టించేందుకు ప్రయత్నించే శక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో 22వ వార్డు కౌన్సిలర్ అరవ లక్ష్మి, సామాజిక సమరసత వేదిక కరీంనగర్ విభాగ్ సంయోజక్ చెట్ల గంగాధర్, నాయకులు వేముల పోచమల్లు, సింగం గంగాధర్, నరేందుల శ్రీనివాస్, కొత్తకొండ బాలన్న, ఆర్ఎస్ఎస్ వీరన్న, ఇల్లెందుల పురుషోత్తం, యడమల వెంకట్‌రెడ్డి, బొందుకూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## భీమన్న సేవలో ఏపీ జూనియర్ సివిల్ జడ్జి

వేములవాడ అర్బన్, జూలై 22 (ఈవార్తలు): శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామివారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అమరావతికి చెందిన జూనియర్ సివిల్ జడ్జి లిఖిత బుధవారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం నిర్వహించి, కుటుంబ సభ్యులతో కలిసి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక దర్శనం చేసుకుని స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయ మండపంలో అర్చకులు, వేద పండితులు జడ్జి లిఖితతో పాటు వారి కుటుంబ సభ్యులకు స్వామి--అమ్మవార్ల శేషవస్త్రాలు, లడ్డూ ప్రసాదాన్ని అందజేసి వేదాశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు జి. శ్రీనివాస్ శర్మ, ప్రోటోకాల్ పర్యవేక్షకులు పెరుక శ్రీనివాస్, ఆలయ ఉద్యోగులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## ఇండ్ల గణన చేసిన టీచర్లకు సెలవులు ఇవ్వాలి

జగిత్యాల, జూలై 22 (ఈవార్తలు): గత వేసవి సెలవుల్లో జనాభా గణన 2027 లో భాగంగా ఇండ్ల గణన చేసిన సూపర్వైజర్లు మరియు ఎన్యూమరేటర్లుగా విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు సంపాదిత సెలవులు మంజూరు చేయాలని పిఆర్టియూ టిఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బోయిని పెల్లి ఆనంద్ రావు, యాల్ల అమర్నాథ్ రెడ్డి జిల్లా విద్యాధికారి రాముకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇండ్ల గణన చేసిన ఉపాధ్యాయులకు వెంటనే సంపాదిత సెలువులు మంజూరు చేయాలన్నారు.

## ఈ20 పెట్రోల్‌తో నష్టం లేదు: కేంద్రం

న్యూఢిల్లీ: ఈ20 (20 శాతం ఇథనాల్ మిశ్రమం) పెట్రోల్ వాడటం వల్ల వాహనాల ఇంజిన్లు దెబ్బతింటాయన్న ప్రచారంలో నిజం లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే ఈ10 పెట్రోల్‌కు అనుగుణంగా రూపొందించిన కొన్ని పాత వాహనాల్లో మైలేజీ 3-5 శాతం వరకు తగ్గే అవకాశం ఉందని రాజ్యసభలో తెలిపింది. మైలేజీపై ఇథనాల్ శాతంతో పాటు డ్రైవింగ్ తీరు, వాహనం నిర్వహణ, టైర్లలో గాలి ఒత్తిడి, వీల్ అలైన్‌మెంట్, ఏసీ వినియోగం వంటి అనేక అంశాలు ప్రభావం చూపుతాయని కేంద్రం పేర్కొంది. అదే సమయంలో ఈ20 పెట్రోల్‌తో అధిక ఆక్టేన్ విలువ, మెరుగైన దహన సామర్థ్యం, ఇంజిన్‌లో నాకింగ్ తగ్గడం, వాహనం సాఫీగా పికప్ తీసుకోవడం వంటి ప్రయోజనాలు కూడా ఉంటాయని వివరించింది. ఇటీవల కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కూడా ఈ20 పెట్రోల్‌పై వస్తున్న విమర్శలను ఖండించారు. ఈ20 వల్ల ఏ ఒక్క కారు దెబ్బతిన్నట్లు ఆధారాలు లేవని, ఇలాంటి ఆరోపణలు తప్పుడు ప్రచారంలో భాగమేనని ఆయన వ్యాఖ్యానించారు.

## మూడోరోజూ నష్టాలు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో సెషన్‌లోనూ భారీ నష్టాలతో ముగిశాయి. రియల్టీ, పీఎస్‌యూ బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలతో ముడిచమురు ధరలు పెరగడం ఇన్వెస్టర్ల సెంటిమెంట్ ను దెబ్బతీశాయి. దాంతో బుధవారం నాటి ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 715.06 పాయింట్లు (0.92 శాతం) పతనమై 76,755.05 వద్ద ముగిసింది. నిఫ్టీ 191.45 పాయింట్లు (0.79 శాతం) కోల్పోయి 23,996.25 వద్ద స్థిరపడింది. అదేవిధంగా నిఫ్టీ సూచీ కూడా కీలకమైన 24,000 పాయింట్ల కంటే దిగువకు పడిపోయింది. మార్కెట్ నిపుణుల ప్రకారం.. నిఫ్టీకి 24,200 స్థాయి కీలక నిరోధంగా మారింది. ఈ స్థాయిని దాటితేనే మార్కెట్లో మళ్లీ కొనుగోళ్ల జోరుపెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. మరోవైపు 24,000 దిగువన కొనసాగితే మరింత అమ్మకాల ఒత్తిడి పెరిగి నిఫ్టీ 23,900–23,800 స్థాయిల వరకు పడిపోయే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## ఉగ్రవాది కాల్పుల్లో హెడ్ కానిస్టేబుల్ మృతి

శ్రీనగర్: జమ్మూ కశ్మీర్‌లో భద్రతా సిబ్బందిపై ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. అనంతనాగ్ పట్టణంలో బుధవారం అనుమానిత ఉగ్రవాదులు పోలీసు బృందంపై కాల్పులు జరపడంతో 35 ఏళ్ల పోలీసు అధికారి ప్రాణాలు కోల్పోయినట్టు అధికారులు తెలిపారు. అనంతనాగ్‌లోని లాల్ చౌక్ వద్ద మధ్యాహ్నం 12.30 గంటల ప్రాంతంలో ఈ ఘటన జరిగినట్టు అధికారులు చెప్పారు. దాడికి గురైన పోలీసు బృందం అమర్‌నాథ్ యాత్ర భద్రతా విధుల్లో ఉంది. ఈ దాడిలో విధుల్లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ ఆషిక్ హుస్సేన్ ఖురేషి మరణించారు. ముష్కరుల కాల్పుల్లో గాయపడిన ఖురేషిని అనంతనాగ్‌లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే అతడు మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. ఈ దాడికి తామే పాల్పడినట్టు లష్కరే తొయిబా అనుబంధ సంస్థ ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్) సోషల్ మీడియాలో ప్రకటించింది. ఘటనతో అప్రమత్తమైన భద్రతా బలగాలు.. ఆ ప్రాంతంలో భారీ ఎత్తున గాలింపు చేపట్టాయి. అమర్‌నాథ్ యాత్ర నేపథ్యంలో అనంత్‌నాగ్‌లో భారీగా భద్రతా సిబ్బందిని మోహరించారు. గత నాలుగు రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తుండటంతో ప్రతీకూల వాతావరణం కారణంగా అమర్‌నాథ్ యాత్రను అధికారులు నిలిపివేశారు.

## ఇదెట్ల పబ్లిసిటీ?

**పోలీసుల క్రూరత్వంపై ఢిల్లీ హైకోర్టు ఆగ్రహం**

న్యూఢిల్లీ: పార్లమెంటు ముట్టడికి వెళ్తోన్న 'కాక్రోచ్ జనతా పార్టీ' నేతృత్వంలోని నిరసనకారులపై పోలీసులు క్రూరత్వాన్ని నిరసిస్తూ దాఖలైన పిటిషన్లపై ఢిల్లీ హైకోర్టు విచారణ చేపట్టింది. ఢిల్లీ పోలీసులకు, కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. సీసీటీవీ, ఇతర ఫుటేజీలతో సహా సంబంధిత రికార్డులను భద్రపరచాలని ఆదేశించింది. బుధవారం నాటి విచారణలో పిటిషనర్ల తరఫు లాయర్లు, ఢిల్లీ పోలీసులు , కేంద్రం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్. రాజుకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. మహిళలను లైంగికంగా వేధించారని, వారి మర్మాంగాలపై దాడి చేశారని, మేకులున్న లాఠీలను ఉపయోగించారని, పోలీసు సిబ్బందికి బ్యాడ్జీలు లేవని పిటిషనర్ల తరఫు లాయర్లు ఆరోపించారు. ఇందుకు తమ వద్ద 110 వీడియోలు ఉన్నాయని కూడా వారు తెలిపారు. దీనికి అదనపు సొలిసిటర్ జనరల్ స్పందిస్తూ.. ఆందోళనకారులు అదుపుతప్పారని, పోలీసులు గాయపడ్డారని పేర్కొన్నారు. అంతేకాకుండా ఈ పిటిషన్లు 'పబ్లిసిటీ కోసమే' అని ఆయన ఆరోపించారు. దీనికి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీకే ఉపాధ్యాయ నేతృత్వంలోని ధర్మాసనం "ఇది పబ్లిసిటీ పిటిషన్ అని ఎలా అంటారు?" అని ప్రశ్నిస్తూ ఆ వాదనను తోసిపుచ్చింది. విచారణ ప్రారంభం కాగానే పిటిషనర్ల తరఫున సీనియర్ లాయర్లు ఎన్. హరిహరన్, వికాస్ సింగ్ వాదనలు వినిపిస్తూ.. నిరసనకారులు శాంతియుత నిరసన సహా రాజ్యాంగం వారికి కల్పించిన హక్కులను వినియోగించుకున్నారని తెలిపారు. "ఊహకు అందనిది. అత్యంత క్రూరంగా ప్రవర్తించారు.. ఈ ఉద్యమాన్ని నియంత్రించే, సరైన మార్గంలో నడిపించే సామర్థ్యం ప్రభుత్వానికి లేదని నేను ఏమాత్రం అనడం లేదు... మహిళల ప్రయివేట్ భాగాలపై పోలీసులు కొట్టడం చూడొచ్చు. నిరసనలో పాల్గొన్న మహిళలు లైంగిక వేధింపులకు గురయ్యారు. 90 మందికి పైగా నిరసనకారులు గాయపడ్డారు.. ఈ సంఖ్య పెరుగుతూనే ఉంది. పోలీసులు గాయపడలేదని నేను అనడం లేదు, కానీ క్షేత్రస్థాయిలో ఏం జరిగిందో విచారణ జరపాలి" అని హరిహరన్ ధర్మాసనానికి తెలిపారు.



## నౌకలపై దాడి చేస్తే బ్రిడ్జిలు లేపేస్తాం

**ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక**

వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. హర్ముజ్ జలసంధిలో ఎలాంటి దాడులకు పాల్పడినా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఒకవేళ అటువంటి చర్యలకు దిగితే, ఇరాన్‌లోని వంతెనలను లేదా పవర్ ప్లాంట్‌లను ధ్వంసం చేస్తామని ఆయన హెచ్చరించారు. హర్ముజ్ జలసంధి ద్వారా ప్రయాణించే నౌకలను లక్ష్యంగా చేసుకుంటే, ఇరాన్‌లోని మౌలిక సదుపాయాలపై బాంబుల వర్షం కురిపిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ జలసంధిలో నౌకలపై ఎలాంటి దాడి జరిగినా అమెరికా తీవ్రంగా స్పందిస్తుందని, ఇరాన్‌కు చెందిన కీలక ఆస్తులను లక్ష్యంగా చేసుకుని నిర్ణయాత్మక చర్యలు తీసుకుంటామని ఆయన తేల్చిచెప్పారు. హర్ముజ్ జలసంధి ప్రాంతంలో సముద్ర భద్రత, అంతర్జాతీయ చమురు సరఫరాలపై ఆందోళనలు పెరుగుతున్న నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. అంతర్జాతీయ నౌకాయానానికి ఆటంకం కలిగించే ఇరాన్ చర్యల పట్ల అమెరికా కఠినంగా వ్యవహరిస్తుందనే సంకేతాలను ఈ హెచ్చరిక ఇస్తోంది. ట్రంప్ వ్యాఖ్యలు ప్రాంతీయ స్థిరత్వం, దౌత్యపరమైన ప్రయత్నాలపై ప్రభావం చూపవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఐదేళ్లలో 3 సార్లు నీట్ పేపర్ లీక్

**కేంద్రంపై అన్నామలై ఫైర్**





చెన్నై: నీట్ పేపర్ లీక్ వ్యవహారం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇప్పటికే కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థులు వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలుపుతుండగా... ప్రతిపక్ష పార్టీలూ ఈ అంశంపై పార్లమెంట్‌లో చర్చించాలని పట్టుబడుతున్నాయి. తాజాగా, దీనిపై ఉయ్ ది లీడర్స్ వ్యవస్థాపకుడు, మాజీ ఐపీఎస్ కుప్పుసామి అన్నామలై కేంద్రాన్ని నిలదీశారు. గత ఐదేళ్లలో యూజీ నీట్ ప్రశ్నాపత్రం మూడుసార్లు లీక్ అయ్యిందని, మళ్లీ మళ్లీ పరీక్షలు రాయాల్సి రావడం విద్యార్థులపై తీవ్ర మానసిక ఒత్తిడిని పెంచుతుందని అన్నారు. విద్యార్థులు నిరసనలు తీవ్రరూపం దాల్చినప్పటికీ వారితో ప్రభుత్వం ఎందుకు చర్చలు ప్రారంభించలేదని అన్నామలై మండిపడ్డారు. ఈ మేరకు ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందించారు. "ముందు నుంచి వ్యక్తిగతంగా నేను నీట్ పరీక్షకు మద్దతు ఇస్తూ వచ్చాను. .ఇది దేశవ్యాప్తంగా విద్యార్థుల ఎంపికలో ఏకరూపతను తెస్తుందని, పేదలు కూడా వైద్య విద్యను అభ్యసించే తమ కలను నెరవేర్చుకోవడానికి నిజమైన అవకాశాన్ని కల్పిస్తుందని వాదించాను. కానీ, గత ఐదు సంవత్సరాల్లో నీట్ యూజీ ప్రశ్నాపత్రం మూడుసార్లు లీక్ అయింది.. ఏకరూపతను తీసుకురావాల్సిన వ్యవస్థే విఫలమైనప్పుడు, మళ్లీ మళ్లీ పరీక్ష రాయాల్సి రావడం విద్యార్థులపై ఎంతటి తీవ్ర మానసిక ఒత్తిడిని పెంచుతుందో ఒక్కసారి ఊహించండి... అయినప్పటికీ దీనిపై ఎలాంటి జవాబుదారీతనం లేదు. విద్యార్థులు రోడ్లపైకి వచ్చి తమ ఆవేదనను వెళ్లగక్కడానికి ఈ పరిస్థితే కారణమని నేను బలంగా నమ్ముతున్నాను. ప్రజాస్వామ్యంలో నిరసన అనేది ఒక ప్రాథమిక హక్కు. అయితే, ఇక్కడ అసలైన ప్రశ్న ఏమిటంటే.. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆందోళనాకారులతో చర్చల విషయంలో ఎందుకంత జాప్యం చేసింది? నిరసన తీవ్రరూపం దాల్చే వరకు అర్థవంతమైన చర్చలు ఎందుకు వాయిదా పడ్డాయి? మిమ్మల్ని ఏది అడ్డుకుంది? అదే సమయంలో విద్యార్థులకు, వారికి నాయకత్వం వహిస్తున్న వారికి కూడా బాధ్యత ఉంది. వారాల తరబడి ఒక నిరసన కొనసాగినప్పుడు తమ స్వార్థ ప్రయోజనాల కోసం వేదికను ఉపయోగించుకునే వ్యక్తులు అసలు డిమాండ్లకు ఏమాత్రం సంబంధం లేని అభిప్రాయాలను వ్యక్తం చేయడం లేదా తమ అజెండాను నెరవేర్చుకోవడానికి ఆ ఉద్యమాన్ని పూర్తిగా పక్కదారి పట్టించడానికి ప్రయత్నించడం సహజం. మీరు మౌనంగా ఉంటూ స్వార్థపరుల అజెండాను ముందుకు తీసుకెళ్లేందుకు అనుమతిస్తే... మీ ప్రధాన లక్ష్యాల నుంచి మీరు పక్కకు తప్పుకున్నట్లే అవుతుంది. దయచేసి అలా జరగనివ్వకండి! నిరసనకారులతో అర్థవంతమైన చర్చలు జరిపి, పారదర్శకతను కాపాడమని బీజేపీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాను.. విద్యార్థుల ఆందోళనలను త్వరిగతిన పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకోండి.. ఏ దేశ బలం అయినా ఆ దేశ యువతకు అక్కడి వ్యవస్థలపై ఉండే నమ్మకం పైనే ఆధారపడి ఉంటుంది.. మన విద్యా వ్యవస్థ నిష్పాక్షికత, విశ్వసనీయతపై మన విద్యార్థులే నమ్మకాన్ని కోల్పోతే, దేశ భవిష్యత్తునే ప్రమాదంలో పడేసిన వారమవుతాం" అని ఆయన హెచ్చరించారు.

# పదేళ్లలో 152 పేపర్లు లీక్

**ఒక్కదానికీ శిక్ష పడలేదు.. రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు**



న్యూఢిల్లీ: నీట్ ప్రశ్నాపత్రం లీకేజ్‌పై ప్రధాన ప్రతిపక్ష నేత కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మీడియాకు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. గత పదేళ్లలో 152 పేపర్లు లీకయ్యాయి కానీ, ఒక్కదానికి శిక్షపడలేదని ఆయన ఆరోపించారు. 'దేశానికి అత్యంత విలువైన ఆస్తి అయిన మన విద్యా వ్యవస్థను ఓ వ్యక్తి లేదా సమూహం నాశనం చేసి, మన విద్యార్థుల జీవితాలను ధ్వంసం చేసింది... మరి ప్రభుత్వం ఏం చేస్తుంది? ఒక్కరికి కూడా శిక్షలు విధించలేదు. కాబట్టి మన యువత నిరసన తెలపడానికి ఇదే మొదటి కారణం.. ఇది పూర్తిగా సమంజసమైంది" అని అన్నారు. విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలని, ఆయన ఆ పదవిలో కొనసాగడానికి అనర్హుడని ధ్వజమెత్తారు. "అందరికీ చాలా స్పష్టంగా కనిపిస్తున్న విషయం ఏంటంటే.. ఒకప్పుడు ప్రపంచంలోనే అత్యుత్తమైనదిగా గుర్తింపు పొందిన మన విద్యా వ్యవస్థ నేడు కుమ్మక్కు, అక్రమాలతో నిండిపోయింది... గత పదేళ్లలో 152 పేపర్ లీకేజీలు జరిగాయి. అంటే దాదాపు నెలకు ఒకటి.. ప్రతి నెలా లక్షలాది మంది విద్యార్థులకు 'మీరు పడిన మానసిక ఒత్తిడినంతటినీ మళ్లీ అనుభవించాల్సిందే' అని చెప్తున్నారు. ఆ తర్వాత 'మాకు అస్సలు పట్టదు' అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు... 7.5 కోట్ల మంది విద్యార్థులు, వారి కుటుంబాలు దీనివల్ల నష్టపోతున్నారు.. వీరంతా మధ్యతరగతి, పేద కుటుంబాలకు చెందినవారు... వారు తమ కష్టార్జితాన్ని దీనిపై పెడితే దానికి కనీస గౌరవం కూడా దక్కడం లేదు. దీంట్లో విచిత్రమేమిటంటే ఒక్కరికి కూడా శిక్ష పడకపోవడం. గత 10 ఏళ్లలో 152 లీకేజీలు జరిగినా, ఒక్క శిక్ష కూడా పడలేదు. అంటే ఎవరో ఒక వ్యక్తి లేదా వ్యక్తుల సమూహం మన విద్యా వ్యవస్థను, భారతదేశ అత్యంత విలువైన ఆస్తిని నాశనం చేస్తూ, విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు.. మరి ప్రభుత్వం ఏం చేస్తోంది?" అని రాహుల్ గాంధీ ప్రశ్నించారు. "మన విద్యార్థులకు ఇలా ఎందుకు జరుగుతోంది అన్నదే అసలు ప్రశ్న. వాళ్లు ఏం తప్పు చేశారు? భద్రతా దళాలు వారిపై ఆయుధాలు గురిపెడుతున్నాయి.. శాంతియుతంగా నిరసన తెలుపుతూ, తమ డిమాండ్లను అడుగుతున్నారు.. ఈ దేశం తమకు ఇవ్వాల్సిన వాటిని కోరుతున్నారు. దేశ విద్యార్థులుగా మాకు న్యాయమైన విద్యా వ్యవస్థ కావాలని మాత్రమే వారు అడుగుతున్నారు... ఎంతో మంది పిల్లలు ఆత్మహత్యలు చేసుకున్నారు. మన విద్యార్థులు అంతులేని ఒత్తిడికి గురవుతుంటే, చివరి నిమిషంలో పేపర్ లీక్ అయిందని వారికి చెబుతారు..." అని రాహుల్ గాంధీ మండిపడ్డారు.

## ధర్మేంద్రతో రాజీనామా చేయించు.. అన్నా హజారే లేఖ

పుణే: నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్న వేళ ప్రధాని మోదీకి సామాజిక కార్యకర్త అన్నా హజారే లేఖ రాయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రభుత్వంలో జవాబుదారీతనం పెంచాలని ఆయన కోరారు. నీట్ పరీక్షల పేపర్ లీక్‌లు, విద్యార్థుల సమస్యలపై యువతతో పాటు పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌తో చర్చలు జరపాలని సూచించారు. మంత్రి రాజీనామా చేస్తే ప్రభుత్వం బలహీనపడదని, వ్యవస్థలో జవాబుదారీతనం పెరుగుతుందని అన్నా హజారే స్పష్టం చేశారు. శాఖల్లో వైఫల్యాలకు బాధ్యత వహించేలా చర్యలు తీసుకుంటే, మిగతా మంత్రులకు కూడా స్పష్టమైన సందేశం వెళుతుందని అన్నారు. దీంతో ప్రభుత్వ పనితీరు మరింత బాధ్యతాయుతంగా మారుతుందని అభిప్రాయపడ్డారు. సాధారణంగా కుంభకోణాలు జరిగితే కింది స్థాయి అధికారులపైనే చర్యలు తీసుకుంటారని గుర్తుచేశారు. కానీ శాఖల వైఫల్యాలకు తుది బాధ్యత ఉన్నత నాయకత్వానిదేనని పేర్కొన్నారు. 2024లో నీట్ పరీక్ష పేపర్ లీక్ ఆరోపణలు ఎదుర్కొన్నట్లు గుర్తుచేశారు. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి పునరావృతమై దాదాపు 22 లక్షల మంది విద్యార్థులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షల రద్దు, రీ-ఎగ్జామ్‌ల అనిశ్చితి కారణంగా పలువురు విద్యార్థులు తీవ్ర మనోవేదనకు గురయ్యారన్నారు. మీడియా కథనాల ప్రకారం 22 మంది యువకులు ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. ఉద్యోగ నియామకాల జాప్యం, ప్రశ్నపత్రాల లీకులు, నిరుద్యోగం వంటి అంశాలతో యువత ఆందోళనలో ఉందని, వీటిని కేవలం శాంతిభద్రతల సమస్యగా చూడకూడదని హజారే సూచించారు. ఢిల్లీలో సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన దీక్షపై పోలీసుల చర్యలు, ఆయన్ను బలవంతంగా అక్కడి నుంచి తరలించడం బాధాకరమని హజారే అన్నారు. బలప్రయోగానికి బదులుగా ప్రభుత్వ ప్రతినిధులను పంపించి చర్చలు జరపాల్సిందని సూచించారు. ప్రజాస్వామ్య, గాంధేయ స్ఫూర్తిని పాటిస్తూ ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళనలను ఓపిగ్గా విని, పరస్పర విశ్వాసంతో చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

## 6 వారాల గరిష్ఠానికి చమురు

ముంబై: అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు మరోసారి భగ్గుమన్నాయి. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర గత ఆరు వారాల్లో తొలిసారిగా బ్యారెల్‌కు 95 డాలర్ల మార్కును అధిగమించింది. ప్రపంచ ఇంధన మార్కెట్లో నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, సరఫరా సంబంధిత ఆందోళనలు, మారుతున్న డిమాండ్ పరిస్థితులే ఈ ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా మధ్యప్రాచ్యంలో నెలకొన్న పరిణామాలు, ప్రధాన చమురు ఉత్పత్తి దేశాలు ఉత్పత్తిలో సర్దుబాట్లు చేయడం వంటివి ధరల పెరుగుదలకు దారితీశాయి. ఇది చమురు మార్కెట్లలో మళ్లీ అస్థిరతను సూచిస్తోందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇరాన్ మిలిటరీ స్థావరాలపై అమెరికా వైమానిక దాడులు కొనసాగిస్తుండటంతో, ప్రతిగా ఇరాన్ కూడా బహ్రెయిన్, కువైట్, జోర్డాన్‌లోని అమెరికా సైనిక స్థావరాలపై దాడులకు పాల్పడుతోంది.

# ఎన్డీయే కూటమిలోకి శరద్ పవార్!

**మోదీతో ఎన్సీపీ (ఎస్పీ) అధినేత భేటీ.. పవార్‌ను ఆత్మీయంగా ఆహ్వానించిన మోదీ**



న్యూఢిల్లీ: ఒకవైపు నీట్ లీకేజీతో పాటు పలు అంశాలపై పార్లమెంట్ వెలుపల విపక్ష ఎంపీలు తీవ్ర స్థాయిలో నిరసనలు, నినాదాలతో హోరెత్తిస్తుంటే... మరోవైపు ప్రధాని కార్యాలయంలో జరిగిన ఒక కీలక భేటీ దేశ రాజకీయాల్లో పెను దుమారాన్ని రేపుతోంది. ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్, ఆయన కుమార్తె సుప్రియా సూలేలు ప్రధాని నరేంద్ర మోదీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోల్లో ప్రధాని మోదీ స్వయంగా శరద్ పవార్‌ను చిరునవ్వుతో చేతిని పట్టుకుని ఆహ్వానించడం, ఇద్దరు నాయకులు ఎంతో సంతోషంగా నవ్వుకుంటూ చర్చించుకోవడం కనిపించింది. రైతుల సమస్యలు, నీటిపారుదల రంగానికి సంబంధించిన పలు అంశాలపై పవార్ ప్రధానికి వినతిపత్రం సమర్పించినట్లు సమాచారం. ప్రస్తుత పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లును ఆమోదింపజేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం మూడింట రెండొంతుల మెజారిటీ కోసం ప్రయత్నాలు చేస్తోంది. ఈ సమయంలో 8 మంది ఎంపీలు ఉన్న శరద్ పవార్ పార్టీ మద్దతు ప్రభుత్వానికి చాలా కీలకంగా మారింది. దేశవ్యాప్తంగా 50 శాతం సీట్ల పెంపుపై ప్రభుత్వం లిఖితపూర్వక హామీ ఇస్తే ఈ బిల్లుకు మద్దతు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామని ఇటీవలే సుప్రియా సూలే సంకేతాలు ఇచ్చారు. ఈ పరిణామాల మధ్య శరద్ పవార్ పార్టీ ఎన్డీఏ కూటమిలో చేరుతుందనే ఊహాగానాలు కూడా మొదలయ్యాయి. అయితే, మహారాష్ట్రలోని రెండు ఎన్సీపీ వర్గాలు (అజిత్ పవార్, శరద్ పవార్ వర్గాలు) మళ్లీ విలీనమైతేనే ఎన్డీఏలో అధికారికంగా భాగస్వామ్యం కల్పిస్తామని, వ్యక్తిగతంగా లేదా విడివిడిగా చేర్చుకునే ఉద్దేశం లేదని బీజేపీ స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. విపక్ష ఇండియా కూటమి కేంద్ర ప్రభుత్వంపై విమర్శల దాడిని తీవ్రతరం చేసిన సమయంలోనే, ఆ కూటమిలోని కీలక నేత శరద్ పవార్ ప్రధానితో భేటీ కావడం చర్చనీయాంశంగా మారింది.

## జామర్లు పెట్టినా సీక్రెట్ యాప్‌లతో చాటింగ్

**'సంసద్ ఛలో' హింసలో వెలుగులోకి సంచలన విషయాలు**

న్యూఢిల్లీ: ఢిల్లీలో చోటుచేసుకున్న కాక్రోచ్ జనతా పార్టీ 'సంసద్ ఛలో' ర్యాలీ హింసాత్మకంగా మారిన విషయం అందరికీ తెలిసిందే. ఈ హింసాత్మక ఘటనలో 118 మంది పోలీసు అధికారులు గాయపడగా.. 70 మందికి పైగా నిరసనకారులకు తీవ్ర గాయాలు అయ్యాయి. అలాగే పలు ప్రభుత్వ వాహనాలు కూడా ధ్వంసం కాగా.. ఈ ఘటనపై ఢిల్లీ పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈక్రమంలోనే విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆందోళన సమయంలో నిరసనకారులు సరికొత్త టెక్నాలజీని వాడినట్లు, అలాగే వారు తమలో తాము జరుపుకున్న డిజిటల్ సంభాషణ వివరాలను సైతం పోలీసులు వెలికి తీశారు. ఆందోళనా స్థలంలో ఇంటర్నెట్ సేవలను నిలిపి వేసినా, పోలీసులు నెట్‌వర్క్ జామర్లు అమర్చినా కమ్యూనికేషన్ దెబ్బతినకుండా ఉండేందుకు నిరసనకారులు ముందస్తుగా చేసిన ప్లాన్లు, తీవ్రమైన రాజకీయ వ్యాఖ్యలు ఈ చాట్‌లలో బయటపడ్డాయి. నిరసనకారులు ముందుగానే నెట్‌వర్క్ సమస్యలపై చర్చించుకున్నారు. "ఆందోళన స్థలానికి చేరుకున్నాక మీ ఫోన్లలో నెట్‌వర్క్ రాకపోవచ్చు. పోలీసులు గతంలో లాగే నెట్‌వర్క్ జామర్లు వాడే అవకాశం ఉంది. కానీ మన గ్రూప్‌తో అనుసంధానమై ఉండటం చాలా ముఖ్యం" అని ఒక సందేశంలో ఉంది. దీనికి పరిష్కారంగానే బ్లూటూత్ సిగ్నల్స్ ఆధారంగా ఇంటర్నెట్ లేకుండానే పని చేసే ప్రత్యేక అప్లికేషన్ల లింక్‌లను గ్రూప్‌లలో పంచుకున్నారు. నిరసన స్థలంలోకి అడుగు పెట్టే ముందే ప్రతి ఒక్కరూ ఒకే రకమైన యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని, కనెక్ట్ అయి ఉండాలని సూచనలు ఇచ్చుకున్నారు.

## నీట్‌ను పూర్తిగా రద్దు చేయాలి: టీవీకే

చెన్నై: నీట్ పరీక్షను పూర్తిగా రద్దు చేయాలని ప్రముఖ నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ డిమాండ్ చేసింది. నీట్ పరీక్షలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో దేశ రాజధాని ఢిల్లీలో నిరసనలు వెల్లువెత్తుతున్న తరుణంలో, టీవీకే ఈ డిమాండ్‌ను తెరపైకి తీసుకురావడం ప్రాధాన్యత సంతరించుకుంది. నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలను కేవలం వ్యతిరేకించడమే కాకుండా, ఆ ప్రవేశ పరీక్షను సమూలంగా రద్దు చేయాలని టీవీకే స్పష్టం చేసింది. వైద్య విద్యకు సంబంధించిన అంశాలపై రాష్ట్రాలకు పూర్తి అధికారాలు కల్పించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేసింది. అధికార పక్షమైన డీఎంకే పేరును నేరుగా ప్రస్తావించకుండా, ఆ పార్టీని లక్ష్యంగా చేసుకుంటూ విమర్శలు గుప్పించింది. "నీట్‌ను రద్దు చేస్తాం" అంటూ తప్పుడు వాగ్దానాలతో ప్రజలను మోసం చేయబోమని టీవీకే పేర్కొంది. 2021 అసెంబ్లీ ఎన్నికల సమయంలో, అధికారంలోకి వస్తే నీట్‌ను రద్దు చేస్తామని డీఎంకే ఇచ్చిన హామీని గుర్తు చేస్తూ టీవీకే ఈ వ్యాఖ్యలు చేసింది. విద్యను రాజ్యాంగంలోని ఉమ్మడి జాబితా నుంచి రాష్ట్ర జాబితాలోకి మార్చాలని టీవీకే కేంద్రాన్ని డిమాండ్ చేసింది. నీట్ వ్యవహారంపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేపట్టిన కాక్రోచ్ జనతా పార్టీకి విజయ్ నేతృత్వంలోని పార్టీ తన మద్దతును ప్రకటించింది. అదేవిధంగా, రాహుల్ గాంధీతో పాటు పలువురు విపక్ష నేతల అరెస్టును టీవీకే తీవ్రంగా ఖండించింది.

వయ్యారి చిత్రం





# రణబాలి విడుదల ఆలస్యం?

రౌడీ హీరో విజయ్ దేవరకొండ, నేషనల్ క్రష్ రష్మిక మందన జంటగా నటిస్తున్న మూవీ 'రణబాలి'. వీరిద్దరి పెళ్లి అయిన తర్వాత వస్తోన్న చిత్రం కావడంతో ఈ సినిమా రిలీజ్ కోసం అభిమానులు ఎంతో ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు. కానీ ఈ మూవీ విడుదల వాయిదా పడే అవకాశాలు ఉన్నట్లు టాలీవుడ్‌లో చర్చ జరుగుతోంది. స్టార్టింగ్‌లో సెప్టెంబర్ 11న సినిమాను విడుదల చేస్తామని మేకర్స్ ప్రకటించినప్పటికీ, ఇటీవల షూటింగ్ షెడ్యూల్ ఆలస్యం కావడంతో నిర్ణయించిన తేదీకి చిత్రాన్ని పూర్తి చేయడం కష్టమనే అభిప్రాయంలో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో త్వరలోనే కొత్త విడుదల తేదీని ప్రకటించే అవకాశం ఉందని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. అంతే కాకుండా.. ఇటీవల దర్శకులు రాహుల్ సాంకృత్యాన్ పుట్టిన రోజు స్పెషల్‌గా విడుదల చేసిన పోస్టర్‌లో విడుదల తేదీ (సెప్టెంబర్ 11) మెన్షన్ చేయకపోవడంతో విడుదల వార్తలు మరింత బలంగా వినిపిస్తున్నాయి. కాగా.. ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాను రాహుల్ సాంకృత్యాన్ తెరకెక్కిస్తుండగా.. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ఇందులో రణబాలి అనే వీరుడిగా విజయ్ నటిస్తుండగా.. ఆయన భార్య జయమ్మ పాత్రలో రష్మిక కనిపించనున్నారు. అజయ్ అతుల్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం తెలుగు, తమిళం, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు మేకర్స్.

# 40 పర్సెంట్ స్పిరిట్ కంప్లీట్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న అత్యంత ప్రతిష్ఠాత్మక చిత్రం స్పిరిట్ పై అభిమానుల్లో రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. సినిమా ప్రకటించిన నాటి నుంచి ప్రతి అప్డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, తాజాగా దర్శకుడు సందీప్ రెడ్డి వంగా షూటింగ్ పురోగతిపై కీలక సమాచారం వెల్లడించారు. అమెరికాలోని నార్త్ కరోలినాలో జరిగిన తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న సందీప్ రెడ్డి వంగా, అభిమానులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 'స్పిరిట్' అప్డేట్‌ను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ



దర్శకుడు రామ్ గోపాల్ వర్మ కూడా పాల్గొన్నారు. వేదికపై మాట్లాడిన సందీప్ రెడ్డి వంగా, 'స్పిరిట్' చిత్రీకరణ ఇప్పటికే 40 శాతం పూర్తయిందని వెల్లడించారు. అంతేకాదు, ఈ సినిమా ప్రతి ప్రేక్షకుడికి నచ్చేలా రూపొందిస్తున్నామని, ప్రభాస్ అభిమానుల అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సందీప్ చేసిన ఈ ప్రకటనతో ప్రభాస్ అభిమానులు సోషల్ మీడియాలో సంబరాలు చేసుకుంటున్నారు. సినిమా షూటింగ్ వేగంగా సాగుతుండటంతో విడుదలపై కూడా త్వరలో మరిన్ని అధికారిక ప్రకటనలు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. 'స్పిరిట్' అనౌన్స్‌మెంట్ సమయంలో విడుదలైన వాయిస్ టీజర్‌తోనే సినిమా దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఆ తర్వాత వచ్చిన ఫస్ట్ లుక్ పోస్టర్ కూడా అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంది. ప్రభాస్‌ను "ఇండియాస్ బిగ్గెస్ట్ సూపర్ స్టార్" అంటూ సందీప్ రెడ్డి వంగా పరిచయం చేయడం అప్పట్లో హాట్ టాపిక్‌గా మారింది.

# 'గాడ్జిల్లా గర్ల్' కేలీ హాటిల్ కన్నుమూత

హాలీవుడ్ ప్రముఖ చిత్రం 'గాడ్జిల్లా వర్సెస్ కాంగ్'లో నటించి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న యువ నటి కేలీ హాటిల్ (18) రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయింది. అమెరికాలోని మేరీల్యాండ్‌లో మంగళవారం వేకువజామున జరిగిన కారు ప్రమాదంలో ఆమె మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అంతర్జాతీయ మీడియా సమాచారం ప్రకారం.. కారు అతివేగంగా నడపడమే ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ప్రమాద సమయంలో కారు నడుపుతున్న 19 ఏళ్ల యువకుడు గాయాలతో ఆస్పత్రిలో చేరగా, కారులో ఉన్న మరో ప్రయాణికుడు సురక్షితంగా బయటపడ్డాడు. కేలీ మరణవార్తను ఆమె తండ్రి జాషువా హాటిల్ ఫేస్‌బుక్‌లో అమెరికన్ సైన్ లాంగ్వేజ్ ద్వారా ధ్రువీకరించారు. జార్జియాలో జన్మించిన కేలీ పుట్టుకతోనే బధిరురాలు (చెవిటి). ఆమె తండ్రి వైపు నాలుగు తరాలుగా ఈ సమస్య ఉన్న కుటుంబ నేపథ్యం నుంచి వచ్చింది. తన లోపాన్ని జయించి హాలీవుడ్‌లో అడుగుపెట్టిన ఆమె, 2021లో వచ్చిన 'గాడ్జిల్లా వర్సెస్ కాంగ్', 2024 లో వచ్చిన 'గాడ్జిల్లా ఇ కాంగ్: ది న్యూ ఎంపైర్' చిత్రాల్లో 'జియా' అనే అనాథ పాత్రలో నటించి మెప్పించింది.



## జననాయగన్‌లో
# పూజా పాత్ర తగ్గింపు!



తమిళనాడు సీఎం విజయ్ నటించిన జన నాయగన్ జూలై 23వ తేదీన రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో ఈ సినిమాలో హీరోయిన్ గా నటించిన పూజా హెగ్డేకు ఊహించని షాక్ తగిలింది. ఎడిటింగ్ లో భాగంగా ఆమె పాత్ర నిడివి చాలా తగ్గించారట. సినిమా తీసేటప్పుడు, పూజా హెగ్డే పాత్ర చాలా ఎక్కువగా ఉండేది. కానీ ఎడిటింగ్ లో భాగంగా విజయ్ పాత్రను హైలెట్ చేసేందుకుగాను..ఆమె పాత్రను తగ్గించినట్లు టాక్ నడుస్తోంది. దర్శకుడు వినోద్ సూచనలను మేరకు పాత్ర నిడివి తగ్గించారట. ఈ న్యూస్ ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. ఇది ఇలా ఉండగా ఈ సినిమాలో మమితా బైజు, బాబీ డియోల్ ప్రత్యేక పాత్రల్లో కనిపించనున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ ఈ సినిమాను నిర్మించగా... వినోద్ దర్శకత్వం వహించారు. కాగా విజయ్, పూజా హెగ్డే కాంబినేషన్ లో ఇప్పటికే బీస్ట్ సినిమా వచ్చిన సంగతి తెలిసిందే. వీరిద్దరి కాంబినేషన్ లో జన నాయగన్ రెండో సినిమా.


# వినలేదని నా సినిమాలు లాగేశారు: ప్రియాంక చోప్రా

బాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా దూసుకుపోతున్న ప్రియాంకా చోప్రా.. త్వరలో మహేశ్ బాబు, రాజమౌళి కలయికలో వస్తోన్న 'వారణాసి' చిత్రంతో తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అవుతున్నది. ఈ క్రమంలోనే వరుస ఇంటర్వ్యూస్‌లో పాల్గొంటున్న ఈ అమ్మడు.. తాజాగా చేసిన కామెంట్స్‌తో వార్తల్లో నిలిచింది. 'కొందరిని మెప్పించనందుకు, వారు చెప్పినట్లుగా నేను చేయనందుకు నా సినిమా అవకాశాలు నా నుంచి లాగేసుకున్నారు. ఇతరులు రాజీ పడినట్లుగా, నేను దానికి ఇష్టపడలేదు. కొందరు స్టార్ హీరోలు నన్ను ఉద్దేశపూర్వకంగా సినిమాల నుంచి తప్పించారు. 2007లో 'సలామ్ ఎ ఇష్క్' షూటింగ్ సమయంలో నాకు వేరే సినిమా అవకాశం వచ్చింది. ఆ చిత్ర హీరో ఒకసారి నా దగ్గరకు వచ్చారు. అయితే.. సినిమా స్టార్ట్ అవ్వడానికి నెల రోజుల టైమే ఉండటంతో చర్చించడం కోసం వచ్చారేమో అనుకున్నా.. కానీ నేను ఊహించని విధంగా 'దర్శకుడు ఈ సినిమాను పొరపాటున నీకు ఇచ్చారు.. నిజానికి ఈ పాత్ర వేరే హీరోయిన్‌ది.. మనం త్వరలో మరో సినిమా చేద్దాం' అని చెప్పారు. దీంతో నేను షాక్ అయ్యాను. ఆ టైంలో నా కెరీర్ గురించి ఆలోచించి నటనపై పూర్తి దృష్టి పెట్టాను. అయితే.. ఇలాంటి నా సినీ కెరీర్‌లో ఒకసారి కాదు.. చాలా సార్లు జరిగింది. ఈ విషయాల గురించి నేను ఎక్కువగా మాట్లాడలేను' అంటూ సంచలన వ్యాఖ్యలు చేసింది ప్రియాంక.



# అన్నీ గ్లామరస్ పాత్రలే వచ్చేవి: మహీ గిల్

ఓటీటీల రాకతో సినీ పరిశ్రమలో కథల స్వరూపంతో పాటు నటీనటులకు, ముఖ్యంగా మహిళలకు అవకాశాల పరిధి విశేషంగా పెరిగిందని ప్రముఖ నటి మహీ గిల్ అభిప్రాయపడ్డారు. తన కొత్త వెబ్ సిరీస్ 'రక్తాంచల్ 3' ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆమె తన కెరీర్, ఎదుర్కొన్న సవాళ్ల గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. గతంలో తనకు వరుసగా చీరకట్టు, సిగరెట్, మద్యం తాగే గ్లామరస్ పాత్రలే వచ్చేవని, ఆ తరహా మూస ఇమేజ్ నుంచి బయటపడాలని తీవ్రంగా అనుకున్నట్లు ఆమె వెల్లడించారు. ఆ సమయంలోనే 'రక్తాంచల్ 3'లో లభించిన సరస్వతి దేవి పాత్ర తనకు కొత్త సవాలును విసిరిందని చెప్పారు. వ్యక్తిగత కారణాలతో నాలుగేళ్ల పాటు నటనకు దూరంగా ఉండటం వల్ల ఎన్నో మంచి ప్రాజెక్టులను కోల్పోవాల్సి వచ్చిందని, అయితే దానిపై తనకు ఎలాంటి పశ్చాత్తాపం లేదని 50 ఏళ్ల ఈ నటి పేర్కొన్నారు.



# 'ధురంధర్' నటి ఆయేషా అరెస్ట్

ప్రముఖ నటి, 'బిగ్ బాస్' ఫేమ్ ఆయేషా ఖాన్‌ను ముంబై పోలీసులు అరెస్ట్ చేయడం తీవ్ర కలకలం రేపుతోంది. ఓ నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లిన సమయంలో పోలీసులు ఆమెను వ్యాన్‌లోకి తోసి తీసుకెళ్లారని, తాను కనీసం నిరసన గురించి మాట్లాడకపోయినా పోలీసులు దురుసుగా ప్రవర్తించారని నటి ఆవేదన వ్యక్తం చేసింది. అయితే, బాంద్రా ప్రాంతంలో ఢిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జ్ చేసిన నేపథ్యంలో నిరసన తెలిపేందుకు ఏర్పాటు చేసిన వేదిక వద్దకు ఆయేషా ఖాన్ చేరుకున్న కొద్దిసేపటికే పోలీసులు ఆమెను అడ్డుకున్నారు. ఆమె పోలీసులతో మాట్లాడేందుకు ప్రయత్నించినప్పటికీ, వారు వినకుండా వ్యాన్‌లోకి నెట్టి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ నాటకీయ పరిణామాలకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. తాజాగా ఈ ఘటనపై ఆయేషా ఖాన్ స్పందిస్తూ.. తాను నిరసన ప్రాంతానికి చేరుకున్నానని, కానీ ప్రదర్శన గురించి ఒక్క మాట కూడా మాట్లాడలేదన్నారు. అసలు ఏం జరుగుతుందో అర్థమయ్యేలోపే నన్ను బలవంతంగా వ్యాన్‌లోకి నెట్టేశారని వెల్లడించింది. ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా పోలీసులు ఇలా ప్రవర్తించడం పట్ల ఆయేషా ఖాన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది.



## ఓటమికి భయపడొద్దు: శ్రేయస్

జింబాబ్వేతో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు ముందు భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ యువ ఆటగాళ్లకు కీలక సందేశం ఇచ్చాడు. ఓటమికి భయపడకుండా నిర్భయంగా ఆడితేనే అత్యుత్తమ ప్రదర్శన చేయగలరని సూచించాడు. ఇంగ్లండ్ పర్యటనలో జట్టు ఆశించిన ఫలితాలు సాధించలేకపోయినా, ఆ సిరీస్ నుంచి ఎన్నో పాఠాలు నేర్చుకున్నామని అయ్యర్ తెలిపాడు. జట్టుగా మరింత మెరుగుపడాలంటే పరిస్థితులకు వేగంగా అలవాటు పడడం, మైదానంలో అవగాహనతో ఆడటం, సమష్టి ప్రదర్శన కీలకమని పేర్కొన్నాడు. జింబాబ్వేకు ఆలస్యంగా చేరుకోవడంతో సాధనకు తక్కువ సమయం దొరికిందని అయ్యర్ అన్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఇలాంటి సవాళ్లను ఎదుర్కోవడం సహజమేనని తెలిపాడు. త్వరగా పరిస్థితులకు అలవాటు పడితేనే విజయావకాశాలు పెరుగుతాయని చెప్పాడు. ఇటీవల టీ20 సిరీస్ తర్వాత యువ ఆటగాళ్లకు సాధన చేసేందుకు సమయం దొరికిందని, గత తప్పిదాలను సరిదిద్దుకుని మరింత మెరుగైన ప్రదర్శన చేస్తారనే విశ్వాసం వ్యక్తం చేశాడు. అవసరమైతే తాను వారికి మార్గనిర్దేశం చేస్తానని తెలిపాడు. బయట జరుగుతున్న విమర్శలు, చర్చలను పట్టించుకోవద్దని, వర్తమానంపై మాత్రమే దృష్టి పెట్టాలని అయ్యర్ సూచించాడు. వ్యక్తిగత ప్రదర్శన కంటే జట్టు ప్రయోజనమే ముఖ్యమని, ఐక్యంగా ఆడితే ఫలితాలు వాటంతట అవే వస్తాయని పేర్కొన్నాడు. గురువారం హరారేలో జరిగే తొలి టీ20తో భారత్ జింబాబ్వేపై సిరీస్‌ను ప్రారంభించనుంది.



## ఆత్మవిశ్వాసంతోనే ఉన్నా: వైభవ్

గత నాలుగు నెలల తన అంతర్జాతీయ కెరీర్ ఎన్నో ఒడిదొడుకులతో సాగిందని, అయినా తన ఆత్మవిశ్వాసం ఏమాత్రం చెక్కుచెదరలేదని భారత యువ బ్యాటింగ్ సంచలనం వైభవ్ సూర్యవంశీ అన్నాడు. రేపటి నుంచి జింబాబ్వేతో ప్రారంభం కానున్న మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు ముందు తాను తన ఆట ప్రక్రియపైనే పూర్తి దృష్టి సారించినట్లు స్పష్టం చేశాడు. ఇంగ్లండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో 15 ఏళ్ల వయసులోనే అరంగేట్రం చేసిన సూర్యవంశీ, సచిన్ టెండూల్కర్ రికార్డును బద్దలు కొట్టి భారత్ తరఫున ఆడిన అత్యంత పిన్న వయస్కుడైన క్రికెటర్‌గా చరిత్ర సృష్టించాడు. అయితే, ఆ సిరీస్‌లో ఆడిన మూడు ఇన్నింగ్స్‌లలోనూ 20 పరుగుల మార్కును దాటలేకపోవడంతో చివరి మ్యాచ్‌కు అతడిని పక్కనపెట్టారు. ఈ నేపథ్యంలో 'బీసీసీఐ.టీవీ'కి ఇచ్చిన వీడియోలో సూర్యవంశీ మాట్లాడుతూ.. "అవును.. గడిచిన నాలుగు నెలల్లో చాలా ఒడిదొడుకులు చూశాను. ఇది క్రికెట్‌లో భాగం, ఇలాంటివి జరుగుతూనే ఉంటాయి. కానీ నేను నా ప్రక్రియను నమ్ముకుని, జట్టు కోసం 100 శాతం ప్రదర్శన ఇవ్వాలి. నాకు అవసరమైన మార్గదర్శకత్వం, ప్రాక్టీస్‌ను కోచ్‌లు అందిస్తున్నారు. నాలో ఆత్మవిశ్వాసం ఉంది, చాలా బాగుంది" అని చెప్పాడు. ఈ సిరీస్‌తో సూర్యవంశీ తనకు ఎంతో ప్రత్యేకమైన హరారే స్పోర్ట్స్ క్లబ్‌కు తిరిగి వస్తున్నాడు. సరిగ్గా నాలుగు నెలల క్రితం ఇదే మైదానంలో అండర్-19 ప్రపంచకప్ ఫైనల్‌లో ఇంగ్లండ్‌పై 80 బంతుల్లో 175 పరుగులతో విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడి భారత్‌కు కప్ అందించాడు. "ఇది నాకు చాలా గుర్తుండిపోయే మైదానం. ఇక్కడ అండర్-19 ప్రపంచకప్ గెలిచాం. ఇప్పుడు అదే మైదానంలో దేశం తరఫున ఆడటం సరికొత్త అనుభూతినిస్తోంది. దీన్ని నేను ఆస్వాదిస్తున్నాను" అని సూర్యవంశీ పేర్కొన్నాడు.






# యూట్యూబ్‌లో ఫిఫా..

# అమెరికాకు లక్షల కోట్ల నష్టం?

ఇటీవల ముగిసిన ఫిఫా వరల్డ్ కప్ ఒకవైపు వీక్షణలో సరికొత్త రికార్డులు సృష్టిస్తే, మరోవైపు కొన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలపై ఊహించని ప్రభావాన్ని చూపింది. ఈ టోర్నమెంట్‌కు సంబంధించిన వీడియోలను యూట్యూబ్‌లో ప్రపంచవ్యాప్తంగా 170 కోట్లకు పైగా ప్రత్యేక వీక్షకులు వీక్షించారని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ వెల్లడించారు. ఇది యూట్యూబ్ చరిత్రలోనే అత్యధికంగా వీక్షించిన వరల్డ్ కప్ అని ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా తెలిపారు. ఈ టోర్నమెంట్‌కు సంబంధించిన కంటెంట్‌కు ఇప్పటివరకు వచ్చిన లైఫ్‌టైమ్ వ్యూస్ 200 బిలియన్లు దాటాయని ఆయన పేర్కొన్నారు. యూట్యూబ్ సీఈఓ నీల్ మోహన్ షేర్ చేసిన పోస్ట్‌ను ఉటంకిస్తూ సుందర్ పిచాయ్ ఈ వివరాలను పంచుకున్నారు. టోర్నమెంట్ సందర్భంగా యూట్యూబ్ ప్రత్యేకంగా నిర్వహించిన 'క్రియేటర్ కప్'కు 1 కోటి లైవ్ వ్యూస్ వచ్చాయని నీల్ మోహన్ తెలిపారు. అలాగే, టోర్నమెంట్ అంతటా తమ క్రియేటర్లు అందించిన వ్యాఖ్యానాలకు, విశ్లేషణలకు 25 లక్షలకు పైగా వ్యూస్ వచ్చాయని వివరించారు. ఈ అద్భుతమైన ఛాంపియన్‌షిప్‌లో గెలిచిన స్పెయిన్‌కు ఆయన అభినందనలు తెలిపారు. మరోవైపు ఈ టోర్నమెంట్ ప్రత్యక్ష వీక్షణలోనూ అద్భుత విజయం సాధించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. అమెరికా, కెనడా, మెక్సికోలోని 16 నగరాల్లో జరిగిన 104 మ్యాచ్‌లకు 65 లక్షల మందికి పైగా ప్రేక్షకులు హాజరయ్యారని తెలిపారు. ఇది గత రెండు ప్రపంచ కప్‌ల మొత్తం హాజరు కంటే ఎక్కువని ఆయన పేర్కొన్నారు. 200 దేశాల నుంచి అభిమానులు ఈ మ్యాచ్‌లకు తరలివచ్చారని, ప్రపంచ చరిత్రలోనే ఇది అత్యంత విజయవంతమైన క్రీడా ఈవెంట్ కావచ్చని ట్రంప్ అభిప్రాయపడ్డారు. ఇంతటి ఘన విజయం సాధించినప్పటికీ, ఈ టోర్నమెంట్ అమెరికా ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావాన్ని చూపినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఫిఫా వరల్డ్ కప్ కారణంగా అమెరికాలోని కార్యాలయాల్లో ఉత్పాదకత గణనీయంగా దెబ్బతిన్నదని, దీనివల్ల దేశానికి 11.7 బిలియన్ డాలర్ల (దాదాపు రూ. 1.12 లక్షల కోట్లు) వరకు నష్టం వాటిల్లిందని ఒక నివేదిక అంచనా వేసింది. టోర్నమెంట్ సమయంలో ఉద్యోగులు ఆలస్యంగా ఆఫీసులకు రావడం, మ్యాచ్‌ల కోసం త్వరగా వెళ్లిపోవడం, సెలవులు పెట్టడం వంటి కారణాలతో ప్రపంచవ్యాప్తంగా దాదాపు 17 బిలియన్ డాలర్ల మేర ఉత్పాదకతకు గండి పడిందని యూకేజీ అనే సంస్థ డేటా వెల్లడించింది. మరో వర్క్‌ప్లేస్ ప్లాట్‌ఫామ్ 'ఎన్వాయ్' గణాంకాల ప్రకారం టోర్నమెంట్ నుంచి అమెరికా జట్టు నిష్క్రమించిన మరుసటి రోజు, అంటే జులై 7న, ఆఫీసులకు హాజరయ్యే వారి సంఖ్య 26 శాతం తగ్గింది. అదే రోజు ఉద్యోగుల ఎంట్రీలు కూడా 11.5 శాతం పడిపోయాయి. మొత్తంమీద ఫిఫా వరల్డ్ కప్ ఒకవైపు వీక్షణలో, హాజరులో అపూర్వమైన రికార్డులు నెలకొల్పగా, మరోవైపు కొన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలపై, ముఖ్యంగా ఉత్పాదకతపై తీవ్రమైన ప్రభావాన్ని చూపడం గమనార్హం.




## సింధు, ఆయుష్ శుభారంభం

చైనా ఓపెన్ బ్యాడ్మింటన్‌లో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు రెండో రౌండ్‌కు చేరుకుంది. తొలి రౌండ్‌లో భారత యువ క్రీడాకారిణి ఉన్నతి హూడాపై 21-14, 9-21, 21-10 తేడాతో విజయం సాధించింది. 56 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో రెండో గేమ్‌ను కోల్పోయినా, నిర్ణయాత్మక గేమ్‌లో సింధు పూర్తి ఆధిపత్యం చెలాయించింది. గత ఏడాది ఇదే టోర్నీలో ఉన్నతి చేతిలో ఎదురైన ఓటమికి ఈ విజయంతో సింధు ప్రతీకారం తీర్చుకున్నట్లైంది. జపాన్ ఓపెన్‌లో టైటిల్ గెలిచిన జోరును కొనసాగిస్తున్న సింధు.. రెండో రౌండ్‌లో చైనా స్టార్, నాలుగో సీడ్ చెన్ యుఫేతో తలపడనుంది. ఇటీవల జపాన్ ఓపెన్‌లో చెన్‌ను ఓడించిన ఆత్మవిశ్వాసంతో ఈ మ్యాచ్‌కు సిద్ధమవుతోంది. పురుషుల సింగిల్స్‌లో యువ ఆటగాడు ఆయుష్ శెట్టి సంచలన విజయం నమోదు చేశాడు. ప్రపంచ 11వ ర్యాంకర్, ఇండోనేషియా క్రీడాకారుడు అల్వీ ఫర్హాన్‌ను 21-17, 5-21, 21-17తో ఓడించి ప్రీక్వార్టర్స్‌కు చేరాడు. 2023 ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్ సెమీఫైనల్లో ఎదురైన ఓటమికి ఈ విజయంతో ప్రతీకారం తీర్చుకున్నాడు. అయితే డబుల్స్‌లో భారత్‌కు నిరాశ ఎదురైంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్ కపూర్-రుత్విక శివానీ గద్దె, ధ్రువ్ కపిలా-తనీషా క్రాస్టో జోడీలు తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాయి. పురుషుల డబుల్స్‌లో ఎం.ఆర్.అర్జున్-హరిహరన్ అంసకరుణన్ జోడీ కూడా ఓటమితో టోర్నీకి వీడ్కోలు పలికింది. కాగా, తర్వాత జరిగే పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో లక్ష్యసేన్ జపాన్‌కు చెందిన యుషి తనాకాతో తలపడనున్నాడు.

## బెంగాలీ బిగ్‌బాస్ హోస్ట్‌గా గంగూలీ

భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ తన కెరీర్ లో ఎన్నో జట్టుకు ఎన్నో విజయాలు అందించాడు. రిటైర్మెంట్ తర్వాత బీసీసీఐ అధ్యక్షుడిగా కూడా ఆయన పనిచేశారు. ఆ తర్వాత ఐపీఎల్ లో పలు జట్లకు మెంటార్ గా కూడా వ్యవహరించారు. అలాంటి సౌరవ్ గంగూలీ బిగ్ బాస్ హోస్ట్ గా వ్యవహరించబోతున్నారు. ఇప్పటికే దీనికి సంబంధించిన అప్డేట్ వైరల్ కాగా... దీనిపై మరో గాసిప్ సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. ఈ రియాలిటీ షోను సినీ నటులే హోస్ట్ చేస్తుండగా.... బెంగాలీలో మాత్రం ఆసక్తికరంగా మాజీ క్రికెటర్ సౌరవ్ గంగూలీ హోస్ట్ చేస్తున్నారు. ఇందు కోసం ఏకంగా రూ.125 కోట్ల రెమ్యూనరేషన్ సౌరవ్ గంగూలీ తీసుకుంటున్నట్లు చర్చ జరుగుతోంది. దాదాపు 10 ఏళ్ల తర్వాత బెంగాలీలో మూడో సీజన్ రానుంది. సెప్టెంబర్ లో ఈ షో మొదలుకానుండగా... ఇటీవల ప్రోమో కూడా బయటకు వచ్చింది.





## వైభవ్ లాంటి ప్రతిభ ఉన్న ఆటగాణ్ని చూడలేదు: హర్భజన్

టీమిండియా యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీపై మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ ప్రశంసలు కురిపించాడు. 15 ఏళ్ల వయసులోనే ఎలాంటి భయం లేకుండా అతడు ఆడుతున్న తీరు అద్భుతమని కొనియాడాడు. తన కెరీర్‌లో ఇలాంటి ప్రతిభ ఉన్న ఆటగాణ్ని ఎప్పుడూ చూడలేదని చెప్పాడు. యువ ఆటగాళ్లు తమ సహజ శైలిలో ఆడేందుకు ఇప్పుడు భారత క్రికెట్‌లో మంచి వాతావరణం ఏర్పడిందని పేర్కొన్నాడు. వైభవ్ ఐపీఎల్ అరంగేట్రానికి ముందు జరిగిన ఓ సంఘటనను కూడా హర్భజన్ గుర్తు చేశాడు. తొలి బంతిని ఎలా ఆడతావని కోచ్ రాహుల్ ద్రవిడ్ అడగ్గా, తనకు అనుకూలంగా వస్తే సిక్సర్ కొడతానని వైభవ్ చెప్పాడని, చెప్పినట్టుగానే శార్దూల్ ఠాకూర్ వేసిన తొలి బంతికే సిక్సర్ బాదాడని వెల్లడించాడు. ఇటీవల ఇంగ్లండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో భారత్ తరఫున అత్యంత పిన్న వయసులో అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టిన ఆటగాడిగా వైభవ్ సూర్యవంశీ రికార్డు సృష్టించాడు. తొలి సిరీస్‌లో ఆశించిన స్థాయిలో రాణించకపోయినా, జింబాబ్వేతో జరగనున్న టీ20 సిరీస్‌కు అతడిని మళ్లీ ఎంపిక చేయడంతో తన ప్రతిభను నిరూపించుకునే మరో అవకాశం లభించింది.

నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# నేల తల్లికి విషం పెడుతున్నం!

“అన్నం పరబ్రహ్మ స్వరూపం” అని భారతీయ సంస్కృతి చెబుతుంది. కానీ నేడు మనం తింటున్న ఆహారం నిజంగా ఆరోగ్యాన్ని ఇస్తోందా? లేక నెమ్మదిగా అనారోగ్యానికి దారితీస్తోందా? అధిక దిగుబడుల కోసం గత ఐదు దశాబ్దాలుగా వ్యవసాయంలో రసాయన ఎరువులు, పురుగుమందులు, కలుపు నివారణ మందుల వినియోగం విపరీతంగా పెరిగింది. ప్రారంభంలో ఇవి ఉత్పత్తిని పెంచి దేశాన్ని ఆహార లోటు నుంచి బయటపడేశాయి. అయితే కాలక్రమేణా అదే రసాయన వ్యవసాయం నేల సారాన్ని దెబ్బతీయడం, నీటి వనరులను కలుషితం చేయడం, మన ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపడం వంటి సమస్యలకు కారణమైంది. ఈ నేపథ్యంలో సేంద్రియ వ్యవసాయం మళ్లీ ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తోంది. వ్యవసాయం అనేది కేవలం పంటలు పండించే ప్రక్రియ కాదు. అది నేల, నీరు, విత్తనం, సూక్ష్మజీవులు, పశుసంపద, రైతు, వినియోగదారుడు.. ఈ మొత్తం జీవావరణ వ్యవస్థకు సంబంధించినది. ఈ సమతుల్యత దెబ్బతింటే ప్రకృతి కూడా, మనిషి ఆరోగ్యమూ నష్టపోతాయి. అందుకే సేంద్రియ వ్యవసాయం కేవలం ఒక సాగు పద్ధతి కాదు; ప్రకృతితో సామరస్యంగా జీవించే జీవన విధానం.

హరిత విప్లవం దేశాన్ని ఆకలి నుంచి కాపాడింది. అధిక దిగుబడులు ఇచ్చే విత్తనాలు, రసాయన ఎరువులు, సాగునీటి విస్తరణ వల్ల భారతదేశం ఆహార ధాన్యాల్లో స్వయం సమృద్ధిని సాధించింది. కానీ ఈ విజయానికి మరో వైపు కూడా ఉంది. నేలలోని సేంద్రియ కార్బన్ తగ్గిపోయింది. సూక్ష్మజీవుల సంఖ్య క్షీణించింది. భూగర్భ జలాలు నైట్రేట్లు, రసాయన అవశేషాలతో కలుషితమయ్యాయి. అనేక ప్రాంతాల్లో భూమి సారం క్రమంగా తగ్గిపోవడంతో ఎరువుల మోతాదును ఏటా పెంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. అంటే నేల ఆరోగ్యం క్షీణిస్తే రైతు వ్యయం పెరుగుతుంది, లాభం తగ్గుతుంది. సేంద్రియ వ్యవసాయం ఈ సమస్యలకు ప్రత్యామ్నాయ మార్గాన్ని సూచిస్తోంది. రసాయన ఎరువులకు బదులుగా పశువుల ఎరువు, కంపోస్ట్, వర్మీ కంపోస్ట్, జీవామృతం, ఘన జీవామృతం, పచ్చి ఎరువులు, జీవ ఎరువులు వంటి సహజ వనరులను ఉపయోగించడం దీని ప్రధాన లక్షణం. అలాగే పురుగుమందులకు బదులుగా వేప, దశపర్ణ కషాయం, జీవ నియంత్రణ పద్ధతులు, మిత్రకీటకాలను వినియోగించడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చు. సేంద్రియ వ్యవసాయం వల్ల మొదట లాభపడేది నేల. నేలలో సేంద్రియ పదార్థం పెరగడం వల్ల నీటిని నిల్వ ఉంచే సామర్థ్యం మెరుగుపడుతుంది. భూమిలో సూక్ష్మజీవుల సంఖ్య పెరిగి సహజ సారం పునరుద్ధరించబడుతుంది. వర్షాభావ పరిస్థితుల్లో కూడా పంటలు కొంతవరకు నిలబడే అవకాశం ఉంటుంది. వాతావరణ మార్పుల ప్రభావాన్ని తట్టుకునే సామర్థ్యం కూడా పెరుగుతుంది. అంటే సేంద్రియ వ్యవసాయం కేవలం పర్యావరణానికే కాదు, వాతావరణ సంక్షోభాన్ని ఎదుర్కొనే వ్యవసాయానికి కూడా దోహదపడుతుంది. వినియోగదారుల ఆరోగ్య పరంగా కూడా ఇది అత్యంత కీలకమైన అంశం. కూరగాయలు, పండ్లు, ధాన్యాల్లో అధిక రసాయన అవశేషాలు ఉండటం వల్ల క్యాన్సర్, హార్మోన్ల అసమతుల్యత, నాడీ సంబంధిత సమస్యలు, కాలేయం, మూత్రపిండాల వ్యాధుల ప్రమాదం పెరుగుతుందనే అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయి. ప్రతి రసాయనంతో పండిన పంట హానికరమే అని చెప్పలేం. కానీ అనుమతించిన పరిమితులను మించి రసాయనాల వినియోగం జరిగితే ప్రమాదం పెరుగుతుంది. అందుకే సురక్షితమైన, అవశేషాలు తక్కువగా ఉండే ఆహారంపై ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరుగుతోంది. అయితే సేంద్రియ వ్యవసాయం గురించి కొన్ని అపోహలు కూడా ఉన్నాయి. సేంద్రియ పద్ధతిలో దిగుబడి ఎప్పుడూ చాలా తక్కువగా ఉంటుందని, రైతుకు లాభం ఉండదని కొందరు భావిస్తారు. ప్రారంభ సంవత్సరాల్లో దిగుబడిలో కొంత తగ్గుదల ఉండొచ్చు. కానీ నేల ఆరోగ్యం మెరుగుపడిన తర్వాత ఉత్పత్తి స్థిరపడే అవకాశం ఉంటుంది. పైగా రసాయన ఎరువులు, పురుగుమందుల కొనుగోలుపై అయ్యే ఖర్చు తగ్గుతుంది. మార్కెట్‌లో సేంద్రియ ఉత్పత్తులకు అధిక ధర లభిస్తే రైతు ఆదాయం కూడా పెరగవచ్చు. సమస్య మార్కెటింగ్‌లో ఉంది. సేంద్రియ పంటలను గుర్తించే విశ్వసనీయ ధ్రువీకరణ వ్యవస్థ, ప్రత్యేక మార్కెట్లు, సరైన ధర, వినియోగదారులకు అవగాహన లేకపోవడం రైతులను వెనక్కి నెడుతోంది. ఒక రైతు సేంద్రియ పద్ధతిలో పండించిన పంటకు సాధారణ పంటతో సమాన ధర వస్తే, అతను ఆ పద్ధతిని కొనసాగించడం కష్టమే. అందుకే ప్రభుత్వాలు ధ్రువీకరణ ప్రక్రియను సులభతరం చేయడంతో పాటు రైతు బజార్లలో ప్రత్యేక సేంద్రియ విభాగాలను ఏర్పాటు చేయాలి. తెలుగు రాష్ట్రాల్లో కూడా సేంద్రియ వ్యవసాయానికి మంచి అవకాశాలున్నాయి. తెలంగాణలో ప్రకృతి వ్యవసాయం, రైతు వేదికల ద్వారా అవగాహన పెంచే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించే కార్యక్రమాలు కొన్ని జిల్లాల్లో మంచి ఫలితాలు ఇచ్చాయి. ఈ అనుభవాలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలి. రైతు శిక్షణ, నాణ్యమైన జీవ ఎరువుల అందుబాటు, స్థానిక విత్తనాల పరిరక్షణ, రైతు ఉత్పత్తిదారుల సంఘాల బలోపేతం వంటి చర్యలు అవసరం. వ్యవసాయ విశ్వవిద్యాలయాలు కూడా ఈ దిశగా మరింత పరిశోధన చేయాలి. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి ఇచ్చే సేంద్రియ పద్ధతులు, ప్రాంతానికనుగుణమైన సాగు విధానాలు, జీవ పురుగుమందుల అభివృద్ధిపై దృష్టి పెట్టాలి. రైతులకు శాస్త్రీయ సలహాలు అందించే వ్యవస్థను బలోపేతం చేయాలి. వినియోగదారుల పాత్ర కూడా చాలా ముఖ్యమైనది. ఆరోగ్యకరమైన ఆహారం కోరుకుంటే, సేంద్రియ ఉత్పత్తులకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలి. రైతు నుంచి నేరుగా కొనుగోలు చేయడం, స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా సేంద్రియ వ్యవసాయాన్ని బలోపేతం చేయవచ్చు. అయితే ఒక విషయాన్ని స్పష్టంగా గుర్తించాలి. దేశంలోని మొత్తం వ్యవసాయం ఒక్కసారిగా పూర్తిగా సేంద్రియ పద్ధతిలోకి మారడం ఆచరణ సాధ్యం కాదు. ఆహార భద్రత, రైతుల ఆదాయం, ఉత్పత్తి అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమతుల్య వ్యవసాయ విధానం అవలంబించాలి. రసాయనాల విచక్షణారహిత వినియోగాన్ని తగ్గించడం, సమగ్ర పోషక నిర్వహణ, సమగ్ర పురుగు నివారణ, సేంద్రియ పద్ధతులను దశలవారీగా విస్తరించడం వంటి సమగ్ర దృక్పథమే దీర్ఘకాలిక పరిష్కారం.

# ఒక్కొక్కరు.. 2 లక్షలకు చేరి!



2020లో కొవిడ్-19ప్రజల జీవితాలను, జీవనోపాధిని అస్తవ్యస్తం చేసినప్పుడు... భారీ పరిశ్రమలకు మాత్రమే పునరుద్ధరణను పరిమితం చేయకూడదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గుర్తించారు. ముఖ్యంగా భారతదేశంలోని గ్రామాలు, పట్టణాల్లో ఉన్న చిన్న స్థాయి తయారీదారులకు, సంస్థలకు చేయూత అందించాల్సి ఉంటుంది. ఈ ఉద్దేశంతోనే అదే ఏడాదిలో ఆత్మనిర్భర భారత్ అభియాన్ పరిధిలో ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి రంగం పరిశ్రమల అధికారీకరణ (పీఎంఎఫ్ఎంఈ) పథకం ప్రారంభమైంది. చాలా కాలంగా ఆహార రంగంలో అధికారికంగా లభించే ఆర్థిక, సంస్థాగత సహకారానికి దూరంగా ఉన్న ఒక భాగంతో ఈ పథకం మొదలైంది. అప్పటికే కుటీర పరిశ్రమల్లో ఉత్పత్తులు, విక్రయాలు, ఉపాధి కల్పన జరుగుతున్నాయి. అయితే వృద్ధి చెందడానికి అవసరమైన మూలధనం, మార్గదర్శకత్వం వాటికి లేదు.



చిరాగ్ పాశ్వాన్
కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల మంత్రి

భారతదేశ వృద్ధి క్షేత్రస్థాయి నుంచే, సొంతంగా వ్యాపారాలు ప్రారంభించాలన్న ప్రజల సంకల్పం నుంచే ప్రారంభం కావాలన్న ప్రధానమంత్రి దృఢచిత్తాన్ని ఈ పథకం ప్రతిబింబిస్తుంది. పీఎంఎఫ్ఎంఈ ద్వారా మంజూరైన రుణాల సంఖ్య రెండు లక్షలు దాటింది. ఈ విజయం వెనక ప్రజలు, అధికారిక రుణ వ్యవస్థలోకి అడుగుపెట్టిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఉన్నారు. వృద్ధిని సాధించేందుకు లభించిన అవకాశాన్ని వారు సద్వినియోగం చేసుకున్నారు. అందుకే ఈ విజయం ప్రత్యేకమైనది. ఇది సంబరాలు చేసుకోవాల్సిన, ఈ విజయాన్ని సాధ్యం చేసిన వారిని గౌరవించుకోవాల్సిన సమయం. వారిలో ప్రముఖంగా చెప్పుకోవాల్సిన వ్యక్తి జమన్ లాల్ పాటిదార్. పీఎంఎఫ్ఎంఈ ద్వారా మంజూరైన మొదటి రుణాన్ని స్వీకరించింది ఆయనే. పదో తరగతి మాత్రమే పాసయిన ఆయనకు ఆహార శుద్ధి రంగంలో ఎలాంటి అనుభవం లేదు. కానీ రూ.10 లక్షల పెట్టుబడితో ధనియాల ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రారంభించారు. ఈ పథకంలో చేరడం ద్వారా ఆయనకు రుణం, యంత్రాలు, మార్గనిర్దేశం లభించాయి. ఆయన ఆలోచన పరిశ్రమగా రూపాంతరం చెందింది. ప్రస్తుతం అయిదుగురికి పైగా ఉపాధి కల్పిస్తున్నారు. ఆయన కథ మనకి ఓ విషయం చెబుతోంది. వ్యాపారం అంటే... ధనవంతులకో, బాగా చదువుకున్నవారికో మాత్రమే దక్కే హక్కు కాదు. ఒక వ్యక్తి తన ఆలోచనను కార్యరూపంలోకి తీసుకురావడానికి అవసరమైన ఆర్థిక వనరులు, సాంకేతికత, సహకారం పొందగలడా లేదా అనే దానిపైన ఆధారపడి ఉంటుందని చెబుతుంది. సాధారణ భారత పౌరులు వ్యాపారాన్ని ప్రారంభించి ఇతరులకు ఉపాధి కల్పించేలా చేయడం ద్వారా, ఉద్యోగార్థులను ఉద్యోగాలు అందించే వారిగా మార్చాలన్న ప్రధానమంత్రి ఆశయాన్ని పీఎంఎఫ్ఎంఈ ముందుకు తీసుకువెళుతోంది.

విభిన్నమైన స్థానిక ఉత్పత్తులను తయారు చేసే లక్షలాది కుటీర పరిశ్రమలకు భారత్ పుట్టినిల్లుగా ఉంది. వారిలో చాలా వాటికి తక్కువ వడ్డీకి రుణాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నాణ్యతా ధ్రువీకరణ, వ్యవస్థీకృత మార్కెట్లలో అవకాశాలు లభించడం లేదు. రుణ అనుసంధాన సహాయం, సామర్థ్య నిర్మాణం, సాధారణ మౌలిక వసతులు, బ్రాండింగ్, మార్కెట్ లింకేజి ద్వారా ఈ అంతరాలను పూడ్చేందుకే ఈ పథకం రూపుదిద్దుకుంది. అలాగే అసంఘటిత రంగంలోని సంస్థలను వాటి వృద్ధికి దోహదపడే సంఘటిత ఆర్థిక వ్యవస్థలోకి తీసుకురావడం కూడా ఈ పథకం లక్ష్యాల్లో ఒకటిగా ఉంది. ప్రధానంగా మహిళలే ఈ మార్పును ముందుకు నడిపించారు. మంజూరైన రెండు లక్షల రుణాల్లో దాదాపు 44 శాతం... మహిళలు నిర్వహించే పరిశ్రమలకే లభించాయి. తమ వ్యాపారాలను బలోపేతం చేసుకోవడానికి, మెరుగుపరచుకోవడానికి అవసరమైన ప్రారంభ మూలధనాన్ని నాలుగు లక్షలకు పైగా స్వయం సహాయక బృందాల సభ్యులు అందుకున్నారు. దాదాపు రూ.20,300 కోట్ల పెట్టుబడులను ఆకర్షించిన ఈ పథకం ద్వారా సుమారుగా ఆరు లక్షల మందికి జీవనోపాధి అవకాశాలు లభించాయి. ఎఫ్ఎస్ఎస్ఏఐ, జీఎస్టీ నియమాలకు అనుగుణంగా... ఉద్యమ్ రిజిస్ట్రేషన్ పోర్టల్ ద్వారా 75,000కు పైగా యూనిట్లు సంఘటిత ఆర్థిక రంగంలోకి ప్రవేశించాయి. రుణాలు, సాంకేతికత, విస్తృతమైన మార్కెట్ అవకాశాలు అందుబాటులోకి రావడంతో ఇంట్లో లేదా సమాజంలో నేర్చుకున్న నైపుణ్యాలను గుర్తింపు పొందిన వ్యాపారాలుగా మార్చుకొనే అవకాశం అనేక మంది మహిళలకు లభించింది. మరింత మంది ఈ మార్పును సాధించేలా తోడ్పాటు అందించడమే మన భవిష్యత్తు లక్ష్యంగా ఉండాలి. ఈ లెక్కలన్నింటి వెనక విస్తృత ప్రయోజనాలున్నాయి. రైతుల నుంచి పంటను పరిశ్రమ కొనుగోలు చేస్తుంది. ప్రతి పంట కోత అనంతరం వచ్చే నష్టాలను తగ్గిస్తుంది. పండిన ప్రాంతంలోనే దాని విలువను పెంచుతుంది. ఒక స్థానిక పంట బ్రాండెడ్ ఉత్పత్తిగా మారుతుంది. ఇంటికి మాత్రమే పరిమితమైన నైపుణ్యం ఇప్పుడు స్థిరమైన ఉపాధిని అందిస్తోంది. కాలక్రమేణా... స్థానికంగా తయారవుతున్న ఉత్పత్తి ఆధారంగా ఆ జిల్లా ప్రసిద్ధికెక్కుతుంది. ఒక సారి ఒక సంస్థతో, వోకల్ ఫర్ లోకల్‌ను ఆచరణలో చూపించడం అంటే ఇదే. రాంచీకి చెందిన ఇందర్‌జీత్ సింగ్‌కు మంజూరు చేసిన రుణంతో పీఎంఎఫ్ఎంఈ రెండు లక్షల మైలు రాయిని చేరుకుంది. ఈ రుణంతో బేకరీని నిర్మించుకోవడంతో పాటుగా కేకులు, పేస్ట్రీలు జార్ఖండ్ అంతటా ప్రాచుర్యం పొందుతాయనే తన కలలను కూడా ఆయన సాకారం చేసుకుంటున్నారు. పాటిదార్ మాదిరిగానే ఈయన కూడా చిన్న సంస్థ, పెద్ద ఆశయంతో తన ప్రయాణాన్ని ప్రారంభించారు. ఈ ప్రయాణంలో ఆయనకు పథకం వెన్నుదన్నుగా నిలుస్తుంది. పీఎంఎఫ్ఎంఈ ద్వారా మొదటిసారి రుణం పొంది, వ్యాపారంలో ఎదుగుతున్న వేలాది మంది నూతన వ్యాపారవేత్తలలో ఆయన కూడా ఒకరు. ఈ ప్రయాణం ఎంత దూరం సాగుతుందో పాటిదార్ నిరూపిస్తే, ఈ ప్రయాణం ఇంకా వేగం పుంజుకుంటోందని సింగ్ నిరూపిస్తున్నారు.హా

మన ముందున్నహామార్గం ఇదే. కుటీర పరిశ్రమలకు అధికారిక రుణాలు అందేలా చూడటమే మొదటి లక్ష్యం. అయితే మంజూరైన ప్రతి రుణం లబ్ధిదారునికి చేరేలా, రుణం పొందిన ప్రతి వ్యాపారం దీర్ఘకాలం కొనసాగేలా చూడటం అంటే కష్టంతో కూడుకున్న వ్యవహారమే.హాఅయినప్పటికీ ఇది ఎంతో సంతృప్తినిస్తుంది. మంజూరైన రుణం అవకాశాన్నిస్తుంది. ప్రతి ఔత్సాహిక పారిశ్రామికవేత్త దానిని సద్వినియోగం చేసుకొని స్థిరమైన వ్యాపారాన్ని నిర్మించుకొనేందుకు దోహదపడటమే మా కర్తవ్యం. ఇదే పీఎంఎఫ్ఎంఈ తర్వాతి దశను నిర్వచిస్తుంది. ఆశాజనకమైన సంస్థలకు మేం వేగంగా రుణాలందిస్తాం. మెరుగైన సాంకేతిక పరిజ్ఞానాలను, ప్యాకేజింగులను స్వీకరించడానికి, తమ మార్కెట్ అవకాశాలను మెరుగుపరచుకోవడానికి తోడ్పాటును అందిస్తాం. దేశవిదేశాల్లో కొనుగోలుదారులకు తమ ఉత్పత్తులను చేర్చేలా వారిని సిద్ధం చేస్తాం. రుణం మంజూరు చేయడానికి, మంజూరైన తర్వాత కూడా వారికి అండగా నిలుస్తాం. వారి తొలి రుణాన్ని శాశ్వత జీవనోపాధిగా మార్చేందుకు స్థిరమైన తోడ్పాటును అందిస్తాం. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటే.. రెండు లక్షల రుణాలను మంజూరు చేయడం అంటే పరిపాలనా పరంగా సాధించిన విజయం మాత్రమే కాదు. ప్రతి సంస్థ తన చుట్టూ ఉన్న ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుంది. సమీపంలోని రైతుల నుంచి కొనుగోలు చేస్తుంది. ఇంటికి దగ్గరలోనే ఆదాయాన్ని సృష్టిస్తుంది. సొంతంగా వ్యాపారాలు ప్రారంభించుకొనేలా అనేక మంది మహిళలు, యువ భారతీయుల్లో విశ్వాసాన్ని నింపుతుంది. పాటిదార్ ధనియాల యూనిట్‌ను పరిశీలిస్తే మనకు ఓ విషయం బోధపడుతుంది. పీఎంఎఫ్ఎంఈ ద్వారా మొదటి రుణం మంజూరయ్యే నాటికి ఆయనకు అప్పటికే పేరున్న పరిశ్రమ లేదా ప్రత్యేకమైన డిగ్రీ కూడా లేదు. అతని దగ్గర ఉన్నదల్లా ఒక ఆలోచన, పనిచేయాలన్న పట్టుదల మాత్రమే. ఈ పథకం ఆయనకు అవకాశాన్ని మాత్రమే అందించింది. ఆయనతో మొదలైన ప్రయాణం ఇప్పుడు రెండు లక్షల మందికి చేరుకుంది. దేశవ్యాప్తంగా ఉన్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఈ అవకాశం చేరువయింది. నిలదొక్కుకొనే, ఇతరులకు ఉపాధి కల్పించే, ఉత్పత్తులకు అదనపు విలువను జోడించే మరిన్ని వ్యాపారాలకు సాయం అందించడమే ఇప్పుడు మన ముందున్న లక్ష్యం.

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.